ప్రతిపక్షం

www.prathipaksham.in

ఆదివారం 01.02.2026 | Published From Hyderabad | సంపుటి: 18 సంచిక: 312 పేజీలు: 8 | ₹5

@prathipaksham | prathipaksham tv telugu



న్యూజిలాండ్‌పై భారత్ ఘన విజయం 8

కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రాన్ని నిర్లక్ష్యం చేయొద్దు

వివక్ష చూపిస్తే బీజేపీ ఎంపీలే బాధ్యత వహించాలి




- తెలంగాణ ప్రతిపాదనలపై కేంద్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించాలి
- 8 మంది ఎంపీలు ఉన్నా బీజేపీ ప్రభుత్వం ఎందుకు పట్టించుకోవడం లేదు
- రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో

హైదరాబాద్, జనవరి 31: కేంద్ర ప్రభుత్వం రేపు ప్రవేశ పెట్టే బడ్జెట్‌లో తెలంగాణను నిర్లక్ష్యం చేయొద్దని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. తెలంగాణపై కేంద్ర ప్రభుత్వానికి వివక్షత ఉందన్నారు. తెలంగాణపై బడ్జెట్‌లో వివక్షత చూపిస్తే బీజేపీ ఎంపీలే బాధ్యత వహించాలని అన్నారు. శనివారం గాంధీభవన్‌లో మంత్రి పొన్నం ప్రభాకర్ మీడియాతో మాట్లాడారు. రేపటి పౌర్ణమి తెలంగాణకు వెలుగులు తెస్తుందా..? , చీకటి ఇస్తుందా..? చూడాలని అన్నారు. కేంద్ర బడ్జెట్‌లో ప్రతిసారీ తెలంగాణకు అన్యాయం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. కనీసం ఈ బడ్జెట్‌లోనైనా తెలంగాణకు న్యాయం చేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్ డిమాండ్ చేశారు. తెలంగాణ ఏర్పాటు, ఉద్యమం పట్ల ప్రధాని నరేంద్రమోదీకి వ్యతిరేకత ఉందన్నారు. రింగ్ రోడ్డు, మెట్రో విస్తరణ, మూసీ ప్రక్షాళన వంటి

...:: మిగతా 2లో

> రాజ్యాంగం ప్రకారం నోటీసులు అంటించడం అక్రమమని మాజీ సీఎం అన్నారు. 160 పీఆర్‌సీ ప్రకారం తనకు నోటీసులు ఇచ్చే పరిధి ఏసీపీకి లేదని, తాను ఉండే ఎర్రవల్లిలో తన స్టేట్‌మెంట్ రికార్డు చేయాల్సి ఉంటుందని తెలిపారు. సిట్ విచారణకు మాజీ సీఎంగా, ప్రతిపక్షనేతగా నేను విచారణకు సహకరిస్తానని, రేపు మధ్యాహ్నం మూడు గంటలకు అందుబాటులో ఉంటానని లేఖలో పేర్కొన్నారు. రేపు ఉదయం ఎర్రవల్లి నుంచి హైదరాబాద్‌కు కేసీఆర్ రానున్నారు.



సిట్ విచారణకు హాజరవుతా

నా గౌరవానికి భంగం కలిగించారు

- చట్ట ప్రకారం నోటీసులు ఇవ్వలేదు
- మాజీ ముఖ్యమంత్రి, ప్రతిపక్ష నేత కేసీఆర్
- నందినగర్‌లో కేసీఆర్ విచారణ
- అధికారులతో సిట్ చీఫ్ సమావేశం

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో

హైదరాబాద్, జనవరి 31: ఫోన్ ట్యాపింగ్ కేసులో పోలీసుల విచారణకు హాజరు అవుతానని మాజీ ముఖ్యమంత్రి, ప్రతిపక్ష నేత కేసీఆర్ స్పష్టం చేశారు. హైదరాబాద్ నందినగర్‌లోని నివాసంలో విచారణకు అందుబాటులో ఉంటానని కేసీఆర్‌చెప్పినట్లు సమాచారం. మధ్యాహ్నం మూడు గంటల నుంచి పోలీసులు విచారించనున్నారు. ఐతే రెండోసారి ఇచ్చిన నోటీసును నందినగర్‌లోని నివాసం గోడకు అతికించడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ తరుణంలో జూబ్లీహిల్స్ ఏసీపీకి కేసీఆర్ లేఖ రాశారు. తమకు చట్ట ప్రకారం నోటీసులు ఇవ్వలేదని అసహనం వ్యక్తం చేశారు. తనకు ఇచ్చిన నోటీసు అక్రమమని, నోటీసు ద్వారా తన గౌరవానికి భంగం కలిగించారని ఆవేదన వ్యక్తం చేశారు. నందినగర్‌లో తన

...:: మిగతా 2లో



ముగిసిన మహా జాతర

- చిలుకలగుట్టకు సమ్మక్క
- కన్నెపల్లికి సారలమ్మ
- పూనుగుండ్లకు పగిడిద్దరాజు
- దేవతల వన ప్రవేశం
- మొక్కులు అప్పజెప్పిన భక్తుల తిరుగు ప్రయాణం

ప్రతిపక్షం ప్రతినిధి, హనుమకొండ

జనవరి 31: మేడారం మహాజాతర నాలుగో రోజు ముగిసింది. శనివారం గద్దెల వద్ద పూజల అనంతరం రాత్రి వనదేతవలు వన ప్రవేశం చేశారు. డప్పు, డోలు వాయిద్యాలతో పూజారులు వనదేవతలను గద్దెల నుంచి కన్నెపల్లి, చిలకలగూడ ప్రాంతాలకు తీసుకెళ్లారు. చిలుకలగుట్టకు సమ్మక్కను, కన్నెపల్లికి సారలమ్మను, పూనుగుండ్లకు (మహబూబాబాద్) పగిడిద్దరాజు తరలించారు. గద్దెల పరిసరాల్లో విద్యుత్ దీపాలు నిలిపివేసి పూజారులు వన ప్రవేశం చేయించారు. దీంతో మహాజాతర ముగిసింది. ఈ నేపథ్యంలో ఉదయం నుంచి భక్తులు లక్షలాదిగా తరలి వచ్చి అమ్మవార్లను దర్శించుకున్నారు. జంపన్నవాగులో పుణ్యస్నానాలు చేసి పులకించారు. చివరిరోజు కావడంతో భక్తులతో మేడారం కిటకిటలాడుతోంది. ఈ నెల 28న వనం వీడి జనంలోకి వచ్చిన వనదేవతలు ఇవాళ మళ్లీ వారివారి స్థానాలకు చేరుకున్నారు. రేపు ఆదివారం కావడంతో మేడారంలో రేపు కూడా రద్దీ కొనసాగనుంది.



మొక్కులు అప్పజెప్పిన భక్తుల తిరుగు ప్రయాణం

ఆసియా ఖండంలోనే అతిపెద్ద ఆదివాసీల జాతరైన మేడారం సమ్మక్క సారలమ్మ జాతర ప్రారంభమై నాలుగు రోజులు పూర్తి కావడంతో గుండెల నిండా మొక్కులు అప్పజెప్పిన లక్షలాది మంది భక్తులు వారి వారి స్వస్థలాలకు శనివారం సాయంత్రం తిరుగు ప్రయాణమయ్యారు. కేంద్ర

...:: మిగతా 2లో



కేసీఆర్ మీద ఈ దుర్మార్గపు వైఖరి ఏంటి?

- కేసీఆర్ స్వయంగా తన చిరునామాతో సమాధానం ఇచ్చారు
- ఆయన లేని నివాసానికి రాత్రిపూట గోడకు నోటీసులు అంటించారు
- పైశాచిక ఆనందం పొందడం దారుణం
- పోలీసులకు స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ మీద అవగాహన ఉందా?
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆగ్రహం
- రాష్ట్రవ్యాప్తంగా బీఆర్ఎస్ నిరసన ప్రదర్శనలు

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో

హైదరాబాద్, జనవరి 31: మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్కు సిట్ రెండోసారి ఇచ్చిన నోటీసులు నందినగర్లోని ఆయన నివాసం గోడకు అతికించడంపై ఆ పార్టీ వర్కింగ్‌ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. శనివారం 'ఎక్స్' వేదికగా ముఖ్యమంత్రి రేవంత్రెడ్డిపై విమర్శలు చేశారు. "తెలంగాణ సాధకుడు, ప్రధాన ప్రతిపక్ష నాయకుడు, మాజీ సీఎం కేసీఆర్ మీద ఈ దుర్మార్గపు వైఖరి ఏంటి? కేసీఆర్ స్వయంగా తానుంటున్న నివాసం చిరునామాతో పోలీసులకు సమాధానం ఇచ్చిన తర్వాత కూడా.. ఆయన లేని నివాసానికి రాత్రిపూట వచ్చి గోడకు నోటీసులు

...:: మిగతా 2లో

పుర 'పాలన' మనదే !

- రెబెల్స్ లేకుండా జాగ్రత్త పడండి
- పార్టీ నాయకులతో సీఎం జూమ్ మీటింగ్



ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో

హైదరాబాద్, జనవరి 31: మున్సిపల్ ఎన్నికల్లో 90 స్థానాలను కైవసం చేసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ పార్టీ నాయకులకు పిలుపునిచ్చారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అమెరికా నుంచి జూమ్ మీటింగ్ నిర్వహించారు.ఈ సమావేశంలో టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్,ఇన్‌ఛార్జ్ మీనాక్షి సహా పలువురు మంత్రులు పాల్గొన్నారు.మున్సిపల్ ఎన్నికల సర్వే నివేదికలను టీపీసీసీ చీఫ్ సీఎంకు వివరించారు. రెబల్స్ లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సీఎం సూచించారు.తెలంగాణలో 7 మున్సిపల్ కార్పొరేషన్లు, 116 మున్సిపాలిటీలకు ఎన్నికలు

...:: మిగతా 2లో



మహానగరంలో కాల్పుల కలకలం

- ఓ వ్యక్తిపై కాల్పులు జరిపిన దుండగులు
- రూ.6 లక్షల నగదును ఎత్తుకెళ్లిన దొంగలు
- బాధితుడు రిషద్ కాలికి బుల్లెట్ గాయం
- చికిత్స నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలింపు
- సీసీటీవీ ఫుటేజీలను పరిశీలించిన పోలీసులు
- నిందితుల కోసం పోలీసుల గాలింపు

ప్రతిపక్షం సిటీ బ్యూరో

హైదరాబాద్, జనవరి 31: హైదరాబాద్ మహానగరంలో కాల్పుల ఘటన కలకలం రేపింది. కోఠి బ్యాంక్ స్ట్రీట్‌లో ఎస్బిఐ ప్రధాన కార్యాలయం వద్ద శనివారం ఉదయం కాల్పుల ఘటన చోటు చేసుకుంది. ఓ వ్యక్తిపై

...:: మిగతా 2లో



ఎప్‌స్టీన్ ఫైల్స్‌లో మోదీ పేరుపై భారత్ సీరియస్

ప్రపంచవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఎప్‌స్టీన్ సెక్స్ కుంభకోణం ఫైల్‌లో భారత ప్రధాని నరేంద్ర మోదీ పేరు ఉండడంపై భారత్ తీవ్రంగా స్పందించింది. అవి ఒక లైంగిక నేరస్థుడిగా శిక్ష అనుభవించిన జెఫ్రీ ఎప్‌స్టీన్ చేసిన చెత్త ప్రేలాపణలు అని కొట్టిపారేసింది.

7



అమెరికాలో మరోసారి షట్‌డౌన్

అమెరికాలో మళ్లీ ఆర్థిక సంక్షోభం తలెత్తింది. 2026 బడ్జెట్‌ను ఆమోదించడానికి అర్ధరాత్రి గడువును కాంగ్రెస్ కోల్పోవడంతో శనివారం అమెరికా ప్రభుత్వం పాక్షికంగా షట్‌డౌన్‌లోకి వెళ్లింది.

7



టీఎంసీ సర్కార్‌పై అమిత్ షా నిప్పులు

ఈ ఏడాది మార్చి లేదా ఏప్రిల్‌లో పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో తాజాగా అక్కడి టీఎంసీ ప్రభుత్వంపై కేంద్ర హోం మంత్రి అమిత్ షా తీవ్ర విమర్శలు చేశారు.

7



గౌతమ్ అదానీకి 90 రోజుల గడువు

పారిశ్రామిక వేత్త గౌతమ్ అదానీ, ఆయన తమ్ముని కుమారుడు సాగర్ అదానీ సివిల్ మోసం కేసులో అమెరికా సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ కమిషన్(ఎస్ఈసీ) నుంచి లీగల్ నోటీసులు స్వీకరించడానికి అంగీకరించారు.

7

రాష్ట్రీయం

సిట్ విచారణకు హాజరవుతా

మొదటిపేజీ తరువాయి

నివాసానికి నోటీసు అంటించడం చెల్లదని పేర్కొన్నారు. రాజ్యాంగం ప్రకారం నోటీసులు అంటించడం అక్రమమని మాజీ సీఎం అన్నారు. 160 పీఆర్‌సీ ప్రకారం తనకు నోటీసులు ఇచ్చే పరిధి ఏసీపీకి లేదని, తాను ఉండే ఎర్రవల్లిలో తన స్టేట్‌మెంట్ రికార్డు చేయాల్సి ఉంటుందని తెలిపారు. సిట్ విచారణకు మాజీ సీఎంగా, ప్రతిపక్షనేతగా నేను విచారణకు సహకరిస్తానని, రేపు మధ్యాహ్నం మూడు గంటలకు అందుబాటులో ఉంటానని లేఖలో పేర్కొన్నారు. రేపు ఉదయం ఎర్రవల్లి నుంచి హైదరాబాద్‌కు కేసీఆర్ రానున్నారు.

సిట్ అధికారుల సమావేశం

కేసీఆర్ లేఖ నేపథ్యంలో మరోసారి సిట్ సమావేశమైంది. రేపు మధ్యాహ్నం మూడు గంటలకు కేసీఆర్ విచారణ దృష్ట్యా అధికారులతో సిట్ చీఫ్ సమావేశమయ్యారు. ఒకవేళ కేసీఆర్ విచారణకు హాజరైతే అడగాల్సిన ప్రశ్నావళిని సిట్ ఇప్పటికే సిద్ధం చేసుకున్నట్లుగా సమాచారం. ముఖ్యంగా ఫోన్ ట్యాపింగ్ కేసులో ప్రధాన నిందితుడు ప్రభాకర్‌రావు పునర్నియామకానికి సంబంధించిన నోట్ ఫైల్ ఆధారంగా ఆయన్ని ప్రశ్నించే అవకాశం ఉంది. ఉమ్మడి రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేని రీతిలో విశ్రాంత అధికారిని ఇంటెలిజెన్స్ విభాగానికి ఓఎస్‌డీగా నియమించడంలోనే కుట్ర ఉందనే కోణంలో సిట్ దర్యాప్తు ముమ్మరం చేసింది. మరోవైపు రేపు శాంతియుత పద్ధతిలో నిరసనలకు బీఆర్ఎస్ పిలుపునిచ్చింది. సిట్, ప్రభుత్వ వైఖరికి వ్యతిరేకంగా నిరసనలకు బీఆర్ఎస్ పిలుపునిచ్చింది. బైక్ ర్యాలీలు, నల్ల జెండాలతో నిరసనలు, ధర్నాలు, రాస్తారోకోలు చేపట్టాలని నిర్ణయం తీసుకుంది. మున్సిపల్ ఎన్నికల దృష్ట్యా జిల్లాల నేతలు ఎక్కడికక్కడే నిరసన చేపట్టాలని ఆదేశించింది. హైదరాబాద్‌లోని బీఆర్ఎస్ నేతలు, శ్రేణులు తెలంగాణ భవన్‌కు రావాలని సూచనలు చేసింది.

కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రాన్ని నిర్లక్ష్యం చేయొద్దు

మొదటిపేజీ తరువాయి

తెలంగాణ ప్రతిపాదనలపై కేంద్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించాలని సూచించారు. ఈ విషయంపై కేంద్రానికి, బీజేపీకి చివరిసారిగా గుర్తు చేస్తున్నామని పేర్కొన్నారు. తెలంగాణలో ఎనిమిది మంది బీజేపీ ఎంపీలు ఉన్నప్పటికీ కేంద్రం ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు. కేంద్ర విద్యాసంస్థల స్థాపనకు మోదీ ప్రభుత్వం సహకరించాలని కోరారు. ప్రధాని మోదీ, కేంద్ర మంత్రులు తెలంగాణకి వస్తే తాము గౌరవంగా కలుస్తున్నామని ప్రస్తావించారు. పక్క రాష్ట్రాలకి నిధులు కేటాయిస్తే తాము తప్పు పట్టడం లేదని మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు.

పుర 'పాలన' మనదే !

మొదటిపేజీ తరువాయి

జరగనున్నాయి. అయితే ఈ ఎన్నికల్లో జీహెచ్ఎంసీకి మినహాయింపునిచ్చారు. మొత్తం 2,996 వార్డులకు పోటీ జరగనుంది. ఈనెల 28 నుంచి ప్రారంభమైన నామినేషన్ల ప్రక్రియ శుక్రవారంతో (జనవరి 30) ముగిసింది. శనివారం నాడు నామినేషన్ల పరిశీలన జరుగనుంది. ఫిబ్రవరి మూడున నామినేషన్ల ఉపసంహరణకు చివరి తేదీ. ఫిబ్రవరి 11న పోలింగ్ జరగనుంది. ఆ రోజు ఉదయం 7:00 గంటల నుంచి సాయంత్రం 5:00 గంటల వరకు పోలింగ్ నిర్వహిస్తారు. ఫిబ్రవరి 13న ఫలితాలు వెలువడనున్నాయి. సీఎం రేవంత్ రెడ్డి ఫిబ్రవరి 1న హైదరాబాద్‌కు రానున్నారు.

మహానగరంలో కాల్పుల కలకలం

మొదటిపేజీ తరువాయి

తుపాకీతో కాల్పులు జరిపిన దుండగులు, అతడి నుంచి రూ.6 లక్షల నగదును ఎత్తుకెళ్లారు. నిందితులను పట్టుకునేందుకు పోలీసులు రంగంలోకి దిగారు. ఘటనా స్థలంలోని సీసీటీవీ ఫుటేజీలను పోలీసులు పరిశీలించారు. కాల్పుల ఘటనపై డీసీపీ శిల్పవల్లి, ఐజీ శ్రీనివాస్‌లు ఆరా తీశారు. పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి.. శనివారం ఉదయం ఏడు గంటలకు ఏటీఎంలో డబ్బులను జమ చేసేందుకు రిషద్ అనే వ్యక్తి వచ్చాడు. ఈ క్రమంలోనే అతడిని దుండగులు వెంబడించి కాల్పులకు పాల్పడ్డారు. రిషద్ వద్ద ఉన్న రూ.6 లక్షల నగదును ఎత్తుకెళ్లారు. ఘటనలో బాధితుడు రిషద్ కాలికి బుల్లెట్ గాయమైంది. దీంతో చికిత్స నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. బైక్‌పై వచ్చిన ఇద్దరు దుండగులు కాల్పులు జరిపి డబ్బును ఎత్తుకెళ్లినట్లుగా వెల్లడించారు. బాధితుడు రిషద్‌ను నాంపల్లిలోని వస్త్ర వ్యాపారిగా పోలీసులు గుర్తించారు.

నిందితుల కోసం పోలీసుల గాలింపు

కాల్పుల వ్యవహారంలో పోలీసుల దర్యాప్తు ముమ్మరంగా కొనసాగుతోంది. దొంగలను పట్టుకునేందుకు ఐదు ప్రత్యేక బృందాలు గాలిస్తున్నాయి. ఘటనా స్థలంలో లభించిన సీసీటీవీ ఫుటేజీలను సుల్తాన్‌బజార్ పోలీసులు పరిశీలించారు. ఘటనా స్థలంలో లభించిన రెండు బుల్లెట్ షెల్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. కోఠిలోని కాల్పుల ఘటనతో పరిసర ప్రాంతాల్లో ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. కాల్పుల ఘటనపై సమాచారం అందుకున్న వెంటనే ఖైరతాబాద్ జోన్ డీసీపీ శిల్పవల్లి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. క్లూస్ టీం ఇప్పటికే ప్రాథమిక వివరాలను సేకరించినట్లుగా వెల్లడించారు. ఘటన జరిగిన అనంతరం పోలీసులను దారి మళ్లించేందుకు దుండగులు కోఠి నుంచి కాచిగూడ రైల్వే స్టేషన్‌లోకి వెళ్లినట్లు నటించి తిరిగి బయటకు వచ్చి ఆటో ఎక్కి సికింద్రాబాద్ వెళ్లినట్లుగా తెలిసింది. పోలీసులు ఆ ఆటోడ్రైవర్‌ను విచారించారు. నిందితులు తనకు రూ.60 ఇచ్చారని ఆటో డ్రైవర్ తెలిపాడు. వారి మాటల ఆధారంగా దిల్లీకి చెందిన వారిగా డ్రైవర్ చెప్పినట్లు పోలీసులు తెలిపారు. కాల్పులకు పాల్పడే ముందు దుండగులు బస్‌స్టాప్‌లో ఫోన్‌లో మాట్లాడారు. ఆ నెట్‌వర్క్ ఆధారంగా గాలింపు వేగవంతం చేశారు.

కేసీఆర్ విచారణకు వ్యతిరేకంగా బీఆర్ఎస్ ధర్నాలు

- మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి



ప్రతిపక్షం, నర్సంపేట, జనవరి,31: నర్సంపేటలో బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపున మేరకు రేపు రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు, ధర్నా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. నర్సంపేట నియోజకవర్గంలో నల్ల జెండాలతో బిఆర్ఎస్ నేతలు శాంతియుత నిరసనలు తెలుపుతామని మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం సిట్ ను కేసీఆర్‌పై వేదించడానికి ఉపయోగిస్తోంది. ఎన్నికల ముందు బి ఆర్ ఎస్ ను లక్ష్యంగా పెట్టి రాజకీయ కుట్ర చేస్తున్నారు. సిట్ విచారణల ద్వారా కేసీఆర్‌ను అవమానించడానికి కుట్రలు జరుగుతున్నాయి. మన దృష్టి ప్రభుత్వ వైఫల్యాలపై ఉంటుంది." బిఆర్ఎస్ నాయకులందరిని ఆదివారం నిర్వహించనున్న ధర్నా, నిరసన కార్యక్రమాల్లో ఎక్కువ సంఖ్యలో పాల్గొని విజయవంతం కావాలని కోరారు.

సీసీ కెమెరాలతో నేరాల నియంత్రణ

- సీఐ పవన్ కుమార్ రెడ్డి



ప్రతిపక్షం,మొయినాబాద్, జనవరి 31 : సీసీ కెమెరాలతో నేరాల నియంత్రణ సాధ్యమని సీఐ పవన్ కుమార్ రెడ్డి అన్నారు. ఎన్కేపల్లి గ్రామానికి చెందిన కె. కిషోర్ కుమార్ సహకారంతో గ్రామంలోని ముఖ్య ప్రాంతాల్లో మొత్తం 21 సీసీ కెమెరాలను ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... సీసీ కెమెరాల నిఘాతో దొంగతనాలు, ఇతర కేసులు నిందితులను త్వరగా పట్టుకోవచ్చన్నారు.ఒక సీసీ కెమెరా 100 మంది పోలీసులతో సమానం. సీసీ కెమెరాల వల్ల దొంగతనాలు, అసాంఘిక కార్యకలాపాలు తగ్గడమే కాకుండా, ఏదైనా సంఘటన జరిగితే వెంటనే గుర్తించి చర్యలు తీసుకునే అవకాశం ఉంటుందన్నారు. గ్రామాల్లో సీసీ కెమెరాల ఏర్పాటు వల్ల ప్రజలు మరింత భద్రతా భావంతో జీవించగలుగుతారని తెలిపారు. అనంతరం కిషోర్ ను సీఐ పవన్ కుమార్ రెడ్డి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ నరసింహారావు, విపిఓ టి, రాము చందర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



ముగిసిన మహా జాతర

మొదటిపేజీ తరువాయి

ప్రభుత్వం ఎన్నో ఏళ్లుగా మేడారం జాతరకు జాతీయ హోదా కల్పిస్తామని హామీ ఇస్తూనే ఈసారి కూడా హామీని తుంగలో తొక్కారు. రాష్ట్ర ప్రభుత్వం 250 కోట్లకు పైగా నిధులు వెచ్చించి జాతర ఏర్పాట్లు చేసింది. ఎన్నడూ లేని విధంగా ఈనెల 20న జాతర ప్రాంగణంలో రాష్ట్ర కేబినెట్ సమావేశం నిర్వహించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఎన్నడు లేని విధంగా జాతరలో ఉండి యుద్ధ ప్రాతిపదికన పనులు చేపట్టారు. లక్షలాదిమంది భక్తులకు అనేక సౌకర్యాలు కల్పించారు. భక్తులు తల్లులకు జనాలు నీరాజనాలు పలికితే అధికారులు ఏర్పాటు చేసి భక్తుల చేత శభాష్ అనిపించుకున్నారు.కేంద్ర ప్రభుత్వం నుంచి గిరిజన శాఖ మంత్రి కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి, రాష్ట్ర గవర్నర్, మాజీ గవర్నర్, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, కాంగ్రెస్ వ్యవహారాల ఇంచార్జ్ మీనాక్షి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, కొండా సురేఖ, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఎస్సీ ఎస్టీ చైర్మన్ బక్కి వెంకటయ్య, స్థానిక ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు తదితరులు అమ్మవారి మొక్కలు చెల్లించుకున్నారు. రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క పర్యవేక్షణలో జాతరను పూర్తిస్థాయిలో విజయవంతం చేశారు. రంగురంగుల లైట్లతో విద్యుత్ కాంతుల వెలుగులో ఆ ప్రాంతమంతా వెలిగిపోయింది. విద్యుత్ అధికారులు ఎలాంటి అంతరాయం లేకుండా నిరంతరాయంగా కరెంట్ సరఫరా చేశారు.

కేసీఆర్‌ను టార్గెట్ చేయడం అప్రజాస్వామికం

- బీఆర్ఎస్‌పై కక్షసాధింపు చర్యలు
- సీఎం రేవంత్ రెడ్డిపై బిఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఫైర్



ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, జనవరి 31: టెలిఫోన్‌ట్యాపింగ్ పేరుతో బిఆర్ఎస్‌పై గత రెండేళ్లుగా కక్షసాధింపు చర్యలు కొనసాగుతున్నాయని, అసలు ప్రజా సమస్యలను పక్కదారి పట్టించేందుకే సీఎం రేవంత్ రెడ్డి ప్రతిపక్ష నాయకులపై వేధింపులకు పాల్పడుతున్నారని బిఆర్ఎస్ రాష్ట్ర పార్టీ ప్రధాన కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఆరోపించారు. సిద్దిపేట జిల్లా సిద్దిపేట పట్టణంలోని రంగదాంపల్లి అమరవీరుల స్థూపం వద్ద బిఆర్ఎస్ రాష్ట్ర పార్టీ ప్రధాన కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టెలిఫోన్ ట్యాపింగ్ పేరుతో బిఆర్ఎస్‌పై గత రెండేళ్లుగా వేధింపులు కొనసాగుతున్నాయని ఆరోపించారు. ఇది దారావాహిక సీరియల్ మాదిరిగా సాగుతోందని విమర్శించారు.రేవంత్ రెడ్డి అసలు ప్రజా సమస్యలను పక్కదారి పట్టించి, ప్రతిపక్ష నాయకులను వేధించడమే లక్ష్యంగా పనిచేస్తున్నారని అన్నారు. కాంగ్రెస్ నాయకులు అలీబాబా-40 దొంగలు, దండుపాల్యం ముఠా తరహాలో అనేక కుంభకోణాలకు పాల్పడ్డారని ఆరోపించారు. బొగ్గు స్కాం, 9 వేల ఎకరాల భూ స్కాం వంటి అనేక స్కాంలు జరిగాయని పేర్కొన్నారు .ఈ స్కాంల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకే రేవంత్ రెడ్డి ఇలాంటి నాటకాలు ఆడుతున్నారని, బిఆర్ఎస్ నాయకుల గొంతు నొక్కేందుకు ఎస్ఐటీ పేరిట కుట్రలు చేస్తున్నారని మండిపడ్డారు. రాజకీయ నాయకులకు ట్యాపింగ్‌తో ఎలాంటి సంబంధం ఉండదని, 1875లో వచ్చిన టెలిగ్రాఫ్ చట్టం ప్రకారమే పోలీసు శాఖ సమాచారం సేకరిస్తుందని తెలిపారు. ఏ ముఖ్యమంత్రి కూడా ట్యాపింగ్ చేయమని ఆదేశించరని స్పష్టం చేశారు. విచారణ పేరుతో వ్యక్తిగత హననం చేసేలా మీడియాకు లీకులు ఇస్తున్నారని ఆరోపించారు. తెలంగాణ సాధించిన మహానేత కేసీఆర్‌ను వేధించడం అప్రజాస్వామికమని అన్నారు. 14 ఏండ్ల పాటు మడమ తిప్పని పోరాటం చేసి తెలంగాణ తెచ్చినదే కేసీఆర్ చేసిన నేరమా? అని ప్రశ్నించారు. రేవంత్ రెడ్డి కక్షతోనే కేసీఆర్‌కు నోటీసులు ఇస్తూ వేధిస్తున్నారని తెలిపారు. రాష్ట్ర మంత్రులు పొన్నం ప్రభాకర్ తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణకు, కొండా సురేఖ, సీతక్క సమ్మక్క-సారలమ్మ జాతరకు ఎర్రవెల్లికి వెళ్లి ఆహ్వానిస్తే, అదే సమయంలో పోలీసు అధికారులు నందిని నగర్‌లోని కేసీఆర్ నివాసానికి నోటీసులు ఇవ్వడం దుర్మార్గమైన చర్యగా పేర్కొన్నారు. ఎలక్షన్ అఫిడవిట్‌లో హరీష్‌రావు చిరునామా సిద్దిపేటగా ఉన్నప్పటికీ హైదరాబాద్ ఇంటికి నోటీసులు ఇచ్చారని, కేసీఆర్‌కు మాత్రం హైదరాబాద్‌లోనే నోటీసులు ఇచ్చారని అన్నారు. గతంలో రేవంత్ రెడ్డి చిరునామా కొడంగల్ అయినా హైదరాబాద్‌లో నోటీసులు ఇచ్చారని గుర్తుచేస్తూ, ఇప్పుడు కేసీఆర్ విషయంలో వివక్ష చూపుతున్నారని విమర్శించారు.ప్రతీకార వాంఛతో రేవంత్ రెడ్డి పనిచేస్తున్నారని, దీనికి తెలంగాణ ప్రజలు తగిన శిక్ష తప్పక విధిస్తారని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ హెచ్చరించారు. ఈ సమావేశంలో బి ఆర్ ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు కొండం సంపత్ రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ జంగిటి కనకరాజు, నాయకులు జెల్ల రాములు, యాదయ్య, జవ్వాజి కనకరాజు, పొన్నమల్లు రాములు పాల్గొన్నారు.

మహిళ అదృశ్యం



ప్రతిపక్షం,మొయినాబాద్, జనవరి 31 : ఓ మహిళ అదృశ్యమైన సంఘటన మొయినాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు,పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని రెడ్డిపల్లి గ్రామానికి చెందిన కుండె ప్రవళిక(28) భాస్కర్ ఆసుపత్రిలో ఉద్యోగం చేస్తుంది. రోజుమాదిరిగానే ఉద్యోగంకు వెళ్లి తిరిగి సాయంత్రం లోపు తిరిగి వచ్చేది. రాత్రి అయినా ఇంటికి తిరిగి రాలేదు. వెంటనే ఆమె ఫోన్ కు కాల్ చేయగా ప్రవళిక ఫోన్ స్విచ్ ఆఫ్ వచ్చింది. ఆమె భర్త మహేందర్ విచారణ కోసం భాస్కర్ ఆసుపత్రికి వెళ్లగా ఆమె ఉదయం 11 గంటలకు తన భర్తకు యాక్సిడెంట్ అయ్యిందని చెప్పి ఆసుపత్రి నుండి బయటకు వెళ్లిపోయిందని తెలిపారు. దీంతో మహేందర్ ప్రవళిక కోసం అనుమానస్పద ప్రాంతాల్లో వెతకగా ఆచూకి లబించలేదు.ఆమె ఎరుపు రంగు చీర, 5 అడుగుల ఎత్తు ఉంటుందని తెలిపారు.ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తుచేస్తున్నట్లు తెలిపారు.



మున్సిపల్ పై కాంగ్రెస్ జెండా ఎగరడం ఖాయం

- సిద్దిపేట డీసీసీ అధ్యక్షురాలు ఆంక్ష రెడ్డి

ప్రతిపక్షం, గజ్వేల్, జనవరి 31: కాంగ్రెస్ పార్టీ జెండా గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీలో ఎగరడం ఖాయమని డిసిసి అధ్యక్షురాలు ఆంక్ష రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. శనివారం గజ్వేల్ ప్రజ్ఞాపూర్ 6వ వార్డులో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన కౌన్సిలర్ అభ్యర్థి గాడిపల్లి నవ్యశ్రీ కి మద్దతుగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వార్డు ప్రజలను ఉద్దేశించి ఆంక్ష రెడ్డి మాట్లాడుతూ అత్యధిక మున్సిపల్ వార్డులను కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకోవడం తథ్యమని అన్నారు. వార్డులో సిసి రోడ్లు అసంపూర్తిగా ఉన్నాయని, ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా వార్డులో బస్తి దవాఖాన లేకపోవడం వల్ల స్థానికులు ఇబ్బంది పడుతున్న విషయం తమ దృష్టికి వచ్చిందని తెలిపారు. ఎన్నికల అనంతరం వార్డులో తప్పకుండా బస్తీ దవాఖాన ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ప్రజలకు ఎలాంటి సమస్యలు ఉన్నా తమ దృష్టికి తీసుకురావచ్చని భరోసా కల్పించారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం పని చేసే కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవ్యశ్రీ ని భారీ మెజారిటీతో గెలిపించాలని వార్డు ప్రజలకు ఆమె విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో గజ్వేల్ మార్కెట్ కమిటీ చైర్మన్ నరేందర్ రెడ్డి, దాచారం సర్పంచ్ చెన్నారెడ్డి, కాంగ్రెస్ నాయకులు సుఖేందర్ రెడ్డి, గాడిపల్లి శ్రీనివాస్, జాకీర్, రాజేశ్వర్ రెడీ, సత్తయ్య, వినయ్, జనార్ధన్ రెడ్డి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కేసీఆర్ మీద ఈ దుర్మార్గపు వైఖరి ఏంటి?

మొదటిపేజీ తరువాయి

అంటించి పైశాచిక ఆనందం పొందడం దారుణం. ఇది అహంకారం కాకపోతే మరేమిటి! 65 ఏళ్లు దాటిన వ్యక్తులను వారుంటున్న నివాసం వద్దే విచారించాలన్న నిబంధనను కూడా పోలీసులు అతిక్రమిస్తున్నారు" అని కేటీఆర్ మండిపడ్డారు. అసలు పోలీసులకు స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ మీద అవగాహన ఉందా? అని కేటీఆర్ ప్రశ్నించారు. లేదా ముఖ్యమంత్రి చేతిలో కీలుబొమ్మల్లా ప్రతిపక్ష నాయకులను వేధించడమే పనా? అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ అక్రమ కేసులన్నీ ఛేదిస్తామని.. ప్రతి తప్పుడు పనిని వెలికితీసి తెలంగాణ ప్రజల ముందు పెడతామని తెలిపారు.

రాష్ట్రవ్యాప్తంగా బీఆర్ఎస్ నిరసన ప్రదర్శనలు

సిట్ విచారణ పేరుతో ఉద్దేశపూర్వకంగా కేసీఆర్‌ను వేధిస్తున్నారంటూ రేపు రాష్ట్రవ్యాప్తంగా బీఆర్ఎస్ నేతల నిరసన ప్రదర్శనలు చేయనున్నారు. రేపు రాష్ట్రమంతటా శాంతియుతంగా ఆందోళనలకు దిగాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపునిచ్చారు. రాష్ట్రంలోని 12 వేలకుపైగా గ్రామాల్లో రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మలను దహనం చేయాలని సూచించారు. నిరసనల్లో భాగంగా ప్రతి మున్సిపల్, నియోజకవర్గ కేంద్రాల్లో బీఆర్ఎస్ శ్రేణులు బైక్ ర్యాలీలు నిర్వహించనున్నాయి. నల్ల జెండాలతో నిరసన ప్రదర్శనలు చేపట్టనున్నారు. ధర్నాలు, రాస్తారోకోల ద్వారా ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఆందోళనలు చేయనున్నారు. మాజీ మంత్రులు, సీనియర్ నేతలు, పార్టీ శ్రేణులు ఆందోళనల్లో పాల్గొనాలని కేటీఆర్ పిలుపునిచ్చారు. నిరసనలు శాంతియుతంగా చేయాలని, పోలీసులతో ఘర్షణలు వద్దని సూచించారు.

ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే కేసీఆర్ ను వేధిస్తోంది

తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ పార్టీ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు పై ప్రస్తుత ప్రభుత్వం అనుసరిస్తున్న అప్రజాస్వామిక, రాజకీయ కక్షసాధింపు చర్యలను నిరసిస్తూ ఆదివారం రాష్ట్రవ్యాప్తంగా భారీ ఆందోళనలు చేపట్టాలని బిఆర్ఎస్ పార్టీ నేతలు పిలుపునిచ్చారు. ఈ మేరకు పార్టీ సీనియర్ నేతలు మాజీ మంత్రులు మధుసూదనాచారి, తలసాని శ్రీనివాస్ యాదవ్, సబితా ఇంద్రారెడ్డి, పద్మారావు గౌడ్, ప్రశాంత్ రెడ్డి, సత్యవతి రాథోడ్, బాలమల్లు, కర్నె ప్రభాకర్, ఎం ఎల్ ఏ వివేక్, కృష్ణారావు తదితరులు పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే కేసీఆర్ ను వేధిస్తోందని, రాజకీయ వేధింపుల్లో భాగంగా ఆయనను అవమానిస్తూ అమానుషంగా ప్రవర్తిస్తోందని మండిపడ్డారు. టెలిఫోన్ ట్యాపింగ్ పేరిట కట్టుకథలు సృష్టించి, ఇప్పుడు సిట్ (SIT) విచారణ పేరుతో నోటీసులు జారీ చేయడం దుర్మార్గమైన,నీచమైన వైఖరి అని అభివర్ణించారు.ఆదివారం నిరసన కార్యక్రమాల్లో భాగంగా రాష్ట్రంలోని 12,000 పైచిలుకు గ్రామాల్లో ప్రభుత్వ దిష్టిబొమ్మల దహన కార్యక్రమాలు నిర్వహించాలని వీరు సూచించారు. అలాగే ప్రతి మున్సిపల్ , నియోజకవర్గ కేంద్రాల్లో మోటార్ సైకిల్ ర్యాలీలు, నల్ల జెండాలతో నిరసనలు, ధర్నాలు, రాస్తారోకోలు చేపట్టడం ద్వారా ప్రభుత్వానికి నిరసన సెగ తగిలేలా చేయాలని పిలుపునిచ్చారు. పార్టీ నాయకులు, ప్రజా ప్రతినిధులు ఎక్కడికక్కడ తమ సొంత జిల్లాల్లోనే ఉండి ఈ కార్యక్రమాలను విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులకు ఆదేశించారు. నిరసనలు ప్రజాస్వామ్యబద్ధంగా, శాంతియుతంగా ఉండాలని, పోలీసులతో ఘర్షణలకు తావివ్వకుండా ప్రభుత్వం చేస్తున్న కుట్రలను ప్రజలకు వివరించాలని కోరారు.



ట్రేడ్ డీల్ విషయంలో అమెరికా చెప్పిన ప్రతి అంశానికీ ఇండియా ఒకే చెప్పదు. సొంత ప్రయోజనాలకు రాజీ పడి ఏ దేశమూ ఇతర దేశాలకు తలొగ్గదు. రష్యాతో బిజినెస్ చేస్తున్న దేశాలపై అధిక సుంకాలు విధించడం ట్రంప్ మూర్ఖపు మనస్తత్వానికి నిదర్శనం. ఇలాంటి పనుల వల్ల అమెరికాకే నష్టం వాటిల్లే అవకాశం ఉంది.

- అమెరికా రిటైర్డ్ కల్నల్ డగ్లస్

కేసీఆర్‌పై కాంగ్రెస్ కక్ష సాధింపు వేధింపులు


- మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్



ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, జనవరి 31: కేసీఆర్ చట్టాన్ని గౌరవిస్తూ విచారణకు హాజరవుతున్నప్పటికీ రాజకీయ వేధింపులు కొనసాగుతున్నందుకు ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారని మాజీ మంత్రి ఎమ్మెల్యే, బీ ఆర్ ఎస్ ఎల్పీ డిప్యూటీ లీడర్ తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎల్పీ డిప్యూటీ లీడర్ తలసాని శ్రీనివాస యాదవ్ తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రభుత్వం నడుస్తుందో..? సర్కస్ నడుస్తుందో ఎవరికీ అర్థం కాకపోవడం, కేసీఆర్ ప్రభుత్వ సేవలను అవమానించడంపై ఆయన అసంతృప్తిని వ్యక్తం చేశారు. "రాష్ట్రాన్ని సాధించిన గొప్ప నాయకుడు కేసీఆర్. అందరినీ అక్కున చేర్చుకుని సంక్షేమ ఫలాలు అందించిన గొప్ప నేత కూడా కేసీఆర్. ఒక్కడిగా రాష్ట్ర సాధనకు బయలుదేరి అందరిని ఏక తాటి పైకి తెచ్చి రాష్ట్రాన్ని నిర్మించిన నేతే కేసీఆర్" అని చెప్పారు. ఆయన అన్నారు, అలాంటి సీనియర్ రాజకీయ వేత్త పై కాంగ్రెస్ పార్టీ చేపట్టిన కక్ష సాధింపులను ప్రపంచం చూస్తోంది. కేసీఆర్ ఎక్కడ ఉంటారో అందరికీ తెలుసు, మంత్రులు కూడా అక్కడికి వెళ్లారు. కానీ సిట్ అధికారులు నంది నగర్ నివాసానికి వచ్చి గోడకు నోటీస్ పెట్టి వెళ్లారు. ఇది ఎవరికీ షోకేస్?" తలసాని మండి పడ్డారు. చట్టాన్ని గౌరవిస్తా, విచారణకు సహకరిస్తా అని కేసీఆర్ చెప్పినా, కాంగ్రెస్ కక్ష సాధింపులు ఎందుకు? ప్రజలు కూడా ఈ వేధింపును నిందిస్తున్నారు. కేసీఆర్ న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తే విచారణపై స్టే రావచ్చేది, కేంద్ర అయినప్పటికీ ఆయన చట్టాన్ని గౌరవిస్తూ విచారణకు హాజరవుతున్నారని తెలిపారు. అధికారాన్ని ఉపయోగించి ఇష్టమైనట్లు వ్యవహరిస్తున్నారని తలసాని విమర్శించారు. రాష్ట్రవ్యాప్తంగా బీ ఆర్ ఎస్ పార్టీ ఆదివారం ఆందోళనలకు పిలుపునిస్తున్నందున అన్ని వర్గాల ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొనగలరని తెలిపారు. స్పీకర్ పక్కాగా పార్టీ మారిన ఎమ్మెల్యేలను బీ ఆర్ ఎస్ ఎమ్మెల్యేలుగా పరిగణిస్తూ తీర్పు ఇచ్చారని, అయితే ఇప్పుడు ఆ ఎమ్మెల్యేలు మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థుల కోసం పనిచేస్తున్నారని తలసాని తెలిపారు. "మా ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి తన సొంత నియోజకవర్గంలో దేవుడిని దర్శించుకోవడం పోలీస్‌లు అడ్డుకుంటారా? ఎమ్మెల్యేకు దేవుడిని మొక్కుకునే హక్కు కూడా ఉండదు? ఇది ప్రభుత్వ విధానం తగినదా?" అని ప్రశ్నించారు. నవసరంగా అక్కడ యుద్ధ వాతావరణాన్ని సృష్టించారు. నా రాజకీయ జీవితం లో ఇలాంటి ఘటన చూడలేదు. ప్రాణం పోయినా ఫర్వా లేదు అని అన్నిటికి తెగించి ఉద్యమం చేసిన కేసీఆర్‌పై ఇంతటి కక్ష సాధింపా? అధికారం శాశ్వతం కాదు అని కాంగ్రెస్ నేతలు గ్రహించాలి. మున్సిపల్ ఎన్నికల ప్రక్రియ మొత్తం గందరగోళంగా మారింది. సీనియర్ శాసన సభ్యుడిగా చెబుతున్నా, కాంగ్రెస్ నేతలు పాలనా పద్ధతులు మార్చుకోవాలి" అని అన్నారు. రాష్ట్రంలో కేసీఆర్‌పై సాగుతున్న కక్ష సాధింపును ఏఐసీసీ నాయకత్వం గమనిస్తున్నదా లేదా? లేకపోతే ఒక రాష్ట్రం కాంగ్రెస్ చేతికి వచ్చినప్పుడు ఇలాంటి పాలన చేస్తారా? పద్ధతులు మార్చుకోకపోతే కాంగ్రెస్ తన ఫలితాన్ని అనుభవిస్తుంది. రెండు సంవత్సరాల తర్వాత వచ్చే ప్రభుత్వం కేసీఆర్‌దే, దయచేసి ఒళ్ళు దగ్గర పెట్టి పాలించాలి" అని సూచించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్సీ శంభీ పూర్ రాజు, మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్, బీ ఆర్ ఎస్ నేతలు బొమ్మెర రామమూర్తి, కడారి స్వామి యాదవ్, కార్పొరేటర్లు జగన్, సురేష్ రెడ్డి, సత్యనారాయణ, నాగరాజు యాదవ్ పాల్గొన్నారు.

కేసీఆర్‌కు సిట్ నోటీసులు కక్ష సాధింపే

- శాసన మండలి ప్రతిపక్ష నేత మధుసూదనా చారి



ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, జనవరి 31: శాసన మండలి ప్రతిపక్ష నేత ఎస్. మధుసూదనా చారి రాష్ట్ర ప్రభుత్వంపై తీవ్రంగా మండి పడ్డారు. కేసీఆర్‌కు సిట్ పేరిట నోటీసులు జారీ చేయడం అత్యంత హేయమైన, దుర్మార్గమైన చర్యగా ఆయన అభివర్ణించారు. శనివారం తెలంగాణ భవన్ లో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేసీఆర్ ఒక్క బీఆర్ఎస్‌కు మాత్రమే కాదు, యావత్ తెలంగాణ సమాజానికి నాయకుడని స్పష్టం చేశారు. తెలంగాణ జాతిని వీరోచిత జాతిగా తీర్చిదిద్దిన నేత కేసీఆర్ అని పేర్కొన్నారు.తెలంగాణను అద్భుతంగా అభివృద్ధి చేసిన కేసీఆర్ చేతికి అధికారాన్ని ఇచ్చిన తర్వాత ప్రస్తుత ప్రభుత్వం విధ్వంసం చేస్తోందని ఆరోపించారు. తెలంగాణ జాతి రత్నం కేసీఆర్‌కు సిట్ నోటీసులు జారీ చేయడాన్ని నిరసిస్తూ రేపు రాష్ట్రవ్యాప్తంగా ప్రజలు ఎక్కడికక్కడ నిరసనలు తెలపాలని పిలుపునిచ్చారు. మున్సిపల్ ఎన్నికల్లో ఓటమి భయంతోనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేసీఆర్‌కు సిట్ నోటీసులు పంపారని చారి ఆరోపించారు. బీఆర్ఎస్ శ్రేణుల దృష్టి ఎన్నికలపై ఉండకుండా చేయడానికే ఈ చర్యలు తీసుకుంటున్నారని అన్నారు. సిట్ లో ఉన్నది పోలీసులా లేక రేవంత్ రెడ్డి ప్రైవేటు సైన్యమా అన్న అనుమానాలు కలుగుతున్నాయని వ్యాఖ్యానించారు.కేసీఆర్ ఔన్నత్యాన్ని తగ్గించేందుకు చేసిన చిల్లర ప్రయత్నమే ఈ నోటీసులని విమర్శించారు. తెలంగాణ ఎవరి వల్ల సాధ్యమైంది అంటే కేసీఆర్ వల్లేనని చిన్న పిల్లాడిని అడిగినా చెబుతాడన్నారు. కేసీఆర్‌తో అభివృద్ధిలో పోటీపడాల్సిన ప్రభుత్వం హుందాతనం, పరిణతి చూపడం లేదని అన్నారు.కేసీఆర్‌కు చట్టం పట్ల అపారమైన గౌరవం ఉందని, గాంధేయ వాదంతో శాంతియుత ఉద్యమం నడిపి తెలంగాణ సాధించారని గుర్తు చేశారు. కేసీఆర్ అధికారంలో ఉన్న సమయంలో ఎప్పుడూ కక్ష సాధింపు రాజకీయాలు చేయలేదన్నారు. బొగ్గు స్కాం, జల వివాదాల నేపథ్యంలోనే కేసీఆర్‌కు నోటీసులు పంపారని ప్రజలకు తెలుసునని తెలిపారు. హరీశ్ రావు వరుసగా కుంభకోణాలు బయటపెడుతుండటంతో బీఆర్ఎస్‌పై కక్ష సాధిస్తున్నారని ఆరోపించారు. కేసీఆర్ తయారు చేసిన లక్షలాది సైనికులు రాష్ట్రంలో ఉన్నారని, తమ నాయకుడికి నోటీసులు జారీ చేయడాన్ని వారు సహించరని హెచ్చరించారు.రేవంత్ ఎన్నికుట్రలు చేసినా బీఆర్ఎస్‌ను బలహీనం చేయాలన్న యత్నాలు ఫలించవని మధుసూదనా చారి స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో దేవర మల్లప్ప, సుమిత్రానంద, మన్నె గోవర్ధన్ రెడ్డి, అల్లీపురం వెంకటేశ్వర్ రెడ్డి, ప్రేమ్ కుమార్ దూత్, కొమ్ము నరేందర్ పాల్గొన్నారు.

రేవంత్ డైవర్షన్ రాజకీయాలు

పరాకాష్టకు చేరాయి

- కేసులతో అభివృద్ధిని దాచే ప్రయత్నం
- మండలి మాజీ విప్ కర్నె ప్రభాకర్



ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, జనవరి 31: శాసన మండలి మాజీ విప్ కర్నె ప్రభాకర్ రాష్ట్ర ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విమర్శలు చేశారు. రాష్ట్రంలో అభివృద్ధి జరగాల్సిన సమయంలో డైవర్షన్ పాలిటిక్స్‌కు ప్రభుత్వం పాల్పడుతోందని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి డైవర్షన్ రాజకీయాలను పరాకాష్టకు తీసుకెళ్లారని అన్నారు. ఇది రేవంత్‌కు అలవాటుగా మారిందని విమర్శించారు. ఇటీవల విడుదలైన ఎకనామిక్ సర్వేలో కేసీఆర్ హయాంలో జరిగిన అభివృద్ధిని కేంద్ర ప్రభుత్వమే వేనోళ్ల పొగడ్తలతో గుర్తించిందని చెప్పారు. కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా 17 లక్షల ఎకరాల అదనపు ఆయకట్టు ఏర్పడిందని, మిషన్ కాకతీయ ద్వారా అభివృద్ధి చేసిన చెరువులతో సాగు విస్తీర్ణం గణనీయంగా పెరిగిందని ఎకనామిక్ సర్వే స్పష్టం చేసిందన్నారు. ఈ వాస్తవాలు పత్రికల్లో పతాక శీర్షికలుగా రావడంతో రేవంత్ మరోసారి డైవర్షన్ పాలిటిక్స్ ప్రారంభించారని ఆరోపించారు. రేవంత్ చిన్న పిల్లాడిలా, స్ట్రీట్ బాయ్‌లా వ్యవహరిస్తున్నారని ఘాటుగా వ్యాఖ్యానించారు. కేసీఆర్‌కు మొదటిసారి సిట్ నోటీసులు ఇచ్చినప్పుడు సమాధానంలోనే తన ఎర్రవెల్లి నివాసం గురించి స్పష్టంగా పేర్కొన్నారని గుర్తు చేశారు. కేసీఆర్ పదిహేనేళ్లుగా ఎర్రవెల్లి నివాసంలోనే ఉంటున్నారని, ఆయన ఎక్కడ ఉంటారో ప్రజలందరికీ తెలుసునని అన్నారు. సిట్ అధికారులకు కేసీఆర్ అడ్రస్ తెలియదా అని ప్రశ్నించారు.హరీశ్ రావు సిద్ధిపేట నివాసం అధికారిక రికార్డుల్లో ఉన్నప్పటికీ హైదరాబాద్ నివాసంలో నోటీసులు ఇవ్వలేదా అని ప్రశ్నించారు. కేసీఆర్ నంది నగర్ నివాసానికి వచ్చి గోడకు నోటీసులు అతికించడం ఏంటి అని నిలదీశారు. గతంలో మంత్రులు రెండు సార్లు కేసీఆర్ ఎర్రవెల్లి నివాసానికి వెళ్లి ఆయన్ను ఆహ్వానించలేదా అని గుర్తు చేశారు. రేవంత్ ప్రభుత్వంలో చెక్‌డ్యామ్‌లు పేల్చే సంస్కృతి మొదలైందని, కాళేశ్వరంలో మేడిగడ్డ పిల్లర్‌ను కూడా బాంబులతో పేల్చేశారని ఆరోపించారు. దావోస్ వెళ్లి రేవంత్ నయాపైసా పెట్టుబడులు కూడా తీసుకురాలేదని విమర్శించారు. దావోస్‌లో తన గురువు చంద్రబాబు నాయుడిని కలిశారని వ్యాఖ్యానించారు. రేవంత్ తన గురువును ప్రధాని చేసినా, లోకేశ్‌ను ఏపీ సీఎం చేసినా తమకు అభ్యంతరం లేదని, కానీ ఏపీలోని వేధింపు రాజకీయాలను తెలంగాణలో అమలు చేస్తామంటే కుదరదన్నారు.ఓటుకు నోటు కేసులో రెడ్‌హ్యాండెడ్‌గా దొరికిన దొంగ రేవంత్ అని ఆరోపించారు. మంత్రులు వాటాల్లో మునిగి తేలుతుండగా, వారు రేవంత్‌పై కుట్ర చేస్తున్నారని తెలిసి ఆ విషయాన్ని డైవర్ట్ చేసేందుకే ప్రతిపక్షంపై కేసులు పెడుతున్నారని అన్నారు. ఇలాంటి కేసులకు కేసీఆర్ భయపడరని, ఆయన ఎల్లప్పుడూ చట్ట పరిధిలోనే వ్యవహరిస్తారని తెలిపారు. తనకు ఉన్న హక్కులను వినియోగించుకుంటూ, న్యాయపరమైన సలహాలు తీసుకుని రేపటి విచారణపై కేసీఆర్ నిర్ణయం తీసుకుంటారని కర్నె ప్రభాకర్ స్పష్టం చేశారు.



సజ్జనార్‌కు ఎర్రవల్లి దారి తెలియకపోతే చూపిస్తాం

- బీఆర్ఎస్ ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు

ప్రతిపక్షం సిటీ బ్యూరో, హైదరాబాద్, జనవరి 31: హైదరాబాద్ సీపీ, సిట్ కు సారథ్యం వహిస్తున్న సజ్జనార్ కు కేసీఆర్ ఫామ్ హౌస్ వున్న ఎర్రవల్లికి దారి తెలియకపోతే మేము చూపిస్తామని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు అన్నారు. ఎర్రవెల్లి కేసీఆర్ నివాసానికి సిట్ అధికారులు వెళ్ళడానికి సంకోచిస్తే సిట్ పై ప్రజలు తిరగబడతారు అనుకుంటే, బీఆర్ఎస్ శ్రేణులు సిట్ అధికారులకు రక్షణగా ఉండి ఎర్రవల్లి కేసీఆర్ నివాసానికి తీసుకెళ్తామని అన్నారు. ఇది కాంగ్రెస్ చేస్తున్న రాజకీయ కక్ష. ఇచ్చిన హామీలు నెరవేర్చడం చేతకాక ఇలాంటి చర్యలు. దమ్ముంటే ఇచ్చిన హామీలు నెరవేర్చాలి. ఈ చాతగాని ప్రభుత్వం. కేసీఆర్ మొదట సిట్ నోటీసులు ఇచినప్పుడే సిట్ విచారణకు హాజరవుతా అని స్పష్టంగా చెప్పారని అన్నారు.



విభజన రాజకీయాలపై మేధావుల గర్జన!

- క్షేత్రస్థాయి నివేదికలో విస్తుపోయే నిజాలు: తెలంగాణలో సామాజిక ఐక్యతకు పొంచి ఉన్న ముప్పు
- న్యాయం కోసం బాధితుల 'కన్నీటి' పోరాటం.. వ్యవస్థల మౌనం వెనుక కుట్ర ఎంత?

ప్రతిపక్షం సిటీబ్యూరో, హైదరాబాద్, జనవరి 31: తెలంగాణ గడ్డపై దశాబ్దాలుగా వెల్లివిరిసిన సహజీవన సంస్కృతికి 'రాజకీయ ప్రయోజనాల' గొడ్డలి పెట్టు తగులుతోందని పౌర సమాజం ఆవేదన వ్యక్తం చేసింది. ఒకవైపు భూమి హరణ, మరోవైపు నిరుద్యోగం అట్టడుగు వర్గాలను ఉక్కిరిబిక్కిరి చేస్తుంటే.. ఆ వైఫల్యాల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకు మతం, కులం పేరుతో కృత్రిమ గోడలు కడుతున్నారని అసోసియేషన్ ఫర్ ప్రొటెక్షన్ ఆఫ్ సివిల్ రైట్స్ నిర్వహించిన పీపుల్స్ ట్రిబ్యునల్ హెచ్చరించింది. గ్రౌండ్ టీమ్ సభ్యులు ఇక్రామ్ ఉల్ హక్, ప్రకృతి, తుబా సనోబర్, ఎం.డి. తాజ్, పులి కల్పన మరియు పి. శంకర్ సమర్పించిన నివేదిక తెలంగాణ సామాజిక ముఖచిత్రంలోని చీకటి కోణాలను ఆవిష్కరించింది. ఆదివాసీలు, ముస్లింలు తమ ప్రాథమిక అవసరాల కోసం పోరాడకుండా, వారి మధ్య కుట్రపూరితమైన వైరాన్ని సృష్టించి ఆధిపత్య శక్తులు లబ్ధి పొందుతున్నాయని నివేదిక కుండబద్దలు కొట్టింది. ప్రజాస్వామ్య సంస్థలు విఫలమైనప్పుడు, ఆ మౌనం నేరస్తులకు అభయమిస్తుందని మేధావులు మండిపడ్డారు. సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది ప్రశాంత్ భూషణ్, రిటైర్డ్ జస్టిస్ చంద్రకుమార్, జస్టిస్ అభయ్ థిప్సేల సమక్షంలో జరిగిన ఈ చర్చల్లో వ్యవస్థల వైఫల్యాన్ని ఎండగట్టారు. ఆధిపత్య వర్గాల ప్రయోజనాల కోసం వేగంగా కదిలే యంత్రాంగం, బాధితులు అంచున ఉన్న వారైతే ఎందుకు నిర్లిప్తంగా ఉంటుందని ప్రశ్నించారు. న్యాయం అందించడంలో జరిగే జాప్యం కూడా ఒక వ్యవస్థీకృత హింసేనని, ఇది బాధితుల ఆశను చంపేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రొఫెసర్ హరగోపాల్, అమీర్ అలీ ఖాన్, ఝాన్సీ గెడ్డం మరియు నదీమ్ ఖాన్ లు మాట్లాడుతూ.. ఆదివాసీ సంప్రదాయాలను సైతం హిందూకరణ పేరుతో కనుమరుగు చేస్తున్నారని, బహుళత్వాన్ని సంకుచితం చేయడం ప్రజాస్వామ్యానికే ప్రమాదమని హెచ్చరించారు. ''బాధితులకు కులం ఉండదు.. ఆకలికి మతం ఉండదు'' అనే నినాదంతో సాగిన ఈ సదస్సులో బాధితుల వాంగ్మూలాలు సభికులను కదిలించాయి. వ్యవస్థలు మౌనంగా ఉన్నప్పుడు ప్రతిఘటించాల్సిన బాధ్యత ప్రజలదేనని, భూమి, ఆహారం, ఆత్మగౌరవం కోసం భిన్న గుర్తింపులను పక్కనపెట్టి ఏకమవ్వాలని పిలుపునిచ్చారు. ఈ నివేదిక కేవలం కాగితాల కట్ట కాదు, అణచివేతపై ఎక్కుపెట్టిన అస్త్రమని ఫవాజ్ షాహీన్ పేర్కొన్నారు. నెహ్రూ ఆడిటోరియం వేదికగా సాగిన ఈ గళం, రేపటి తెలంగాణలో సమానత్వానికి, సహజీవనానికి పునాది కావాలని వక్తలు ఆకాంక్షించారు.

మౌలిక సదుపాయాల అభివృద్ధి..

పారిశుధ్య వ్యవస్థ బలోపేతానికి ప్రాధాన్యతనిచ్చాం

- జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి



ప్రతిపక్షం సిటీ బ్యూరో, హైదరాబాద్, జనవరి 31: తమ పాలకవర్గ ఐదేళ్ల పాలనా కాలంలో గ్రేటర్ హైదరాబాద్ నగరంలో మౌలిక సదుపాయాల అభివృద్ధి, పారిశుధ్య వ్యవస్థ బలోపేతానికి అధిక ప్రాధాన్యతనిచ్చామనీ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి తెలిపారు. శనివారం మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అధ్యక్షతన జరిగిన జీహెచ్ఎంసీ 10వ ప్రత్యేక బడ్జెట్ సమావేశంలో మేయర్ బడ్జెట్ ప్రవేశ పెట్టే ముందు ప్రసంగించారు. మేయర్ గా 5 ఏండ్ల తన ప్రస్థానాన్ని గద్వాల్ విజయలక్ష్మి గుర్తు చేసుకున్నారు. మేయర్ గా పదవీ బాధ్యతల స్వీకరణలో సహకరించిన డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్ రెడ్డి, కార్పొరేటర్లు, కమిషనర్ ఆర్వీ కర్ణన్, పూర్వ కమిషనర్ లకు, మేయర్ గా అవకాశం ఇచ్చిన నగర ప్రజలకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. మేయర్ పదవీకాలం తోపాటు మా కార్పొరేటర్లు పదవీకాల ప్రస్థానం వచ్చే నెల ఫిబ్రవరి 10వ తేదీతో ముగియనుందన్నారు. గత ఐదు ఏండ్ల పాలకవర్గ పాలన కాలం విజయవంతంగా పూర్తయ్యిందంటే దానికి కౌన్సిల్ సభ్యులుగా మీరు ఇచ్చిన మార్గదర్శనం, సూచనలు, విమర్శలు కూడా నాకు బలాన్నిచ్చాయని అన్నారు. వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులు, కార్పొరేటర్లు , పారిశుధ్య కార్మికులు ఎండా వానా చూడకుండా, పగలు రాత్రి తేడా లేకుండా నగర అభివృద్ధి కోసం చేసిన మీ సేవలు ఎప్పటికీ మర్చిపోలేనన్నారు. ఘన వ్యర్థాల నిర్వహణ ,రోడ్ల అభివృద్ధి, జంక్షన్ ల అభివృద్ధి ,పౌర సేవల డిజిటలైజేషన్, ప్రజారోగ్య కార్యక్రమాలు వంటి అనేక కీలక నిర్ణయాలు తీసుకున్నాం. ఇవన్నీ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలనే ఒక్క లక్ష్యంతోనే చేపట్టాం.ఈ కృషికి గుర్తింపుగా, జిహెచ్ఎంసి జాతీయ స్థాయిలో అనేక అవార్డులు, ప్రశంసలు, గుర్తింపులు పొందడం మనందరికీ గర్వకారణం. ప్రజలకు మరింత వేగవంతమైన, పారదర్శకమైన, బాధ్యతాయుతమైన సేవలు అందించడంలో మనం సాధించిన పురోగతి, రాబోయే తరాలకు బలమైన పునాది అవుతుందని నాకు పూర్తి విశ్వాసం ఉంది. పదవి ముగిసినా, హైదరాబాద్ పట్ల నా ప్రేమ, నా బాధ్యత, నిబద్ధతత ఎప్పటికీ తగ్గదు. భవిష్యత్తులో కూడా హైదరాబాద్ నగరం మరింత అభివృద్ధి చెందాలి, ప్రజలకు మరింత మెరుగైన జీవన ప్రమాణాలు అందాలి అన్నది నా ఆకాంక్ష అని అన్నారు. 'చివరిగా, నాకు ఈ గొప్ప బాధ్యతను అప్పగించిన నగర ప్రజలకు నేను శిరస్సు వంచి నమస్కరిస్తున్నాను. మీ విశ్వాసమే నా బలంగా నిలిచింది. ఈ ప్రయాణంలో తప్పులు జరిగి ఉండవచ్చు, లోపాలు కనిపించి ఉండవచ్చు. ఒక విషయం మాత్రం గర్వంగా చెప్పగలను - మనమంతా కలిసి ఈ నగరాన్ని మరింత మెరుగైన దిశలో ముందుకు నడిపాము. మేయర్ పదవి ముగిసినా, ఈ నగరంపై నా ప్రేమ, బాధ్యత మాత్రం ఎప్పటికీ కొనసాగుతాయి' అంటూ మేయర్ తన ప్రసంగాన్ని ముగించారు.

చంపాపేట్ కార్పొరేటర్ మరణం పట్ల కౌన్సిల్ దిగ్భ్రాంతి

చంపాపేట్ డివిజన్ కార్పొరేటర్ వంగా మధుసూదన్ రెడ్డి అకాల మరణం పట్ల కౌన్సిల్ దిగ్భ్రాంతి వ్యక్తం చేసింది.

మేయర్ కౌన్సిల్ సభ్యులు వారికి నివాళులర్పించారు వారితో ఉన్న అనుబంధాన్ని కౌన్సిల్ సభ్యులు గుర్తు చేసుకున్నారు. డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్ రెడ్డి మాట్లాడుతూ తన ఐదేళ్ల పదవి కాలం సంతృప్తి మిగిల్చిందన్నారు. ఈ అవకాశాన్ని ఇచ్చిన ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. సహకరించిన కమిషనర్లకు ,అధికారులకు, సిబ్బందికి ధన్యవాదాలు తెలిపారు. ప్రజా ప్రతినిధులు అధికారులు అందరి సమిష్టి కృషి ఫలితంగానే గ్రేటర్ హైదరాబాద్ నగరంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు పథకాలను ,విజయవంతంగా అమలు చేయగలిగామని తెలిపారు. కమిషనర్ల దూరదృష్టి, వేగవంతమైన నిర్ణయాలు, సమన్వయం వల్ల అనేక సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కొని ముందుకు సాగమన్నారు.అధికారులు, సిబ్బంది క్షేత్రస్థాయిలో ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారం కృషి చేయాలని ఆమె కోరారు. కమిషనర్ ఆర్వీ కర్ణన్ మాట్లాడుతూ.. గత బడ్జెట్ తో పోల్చుకుంటే 2026-2027 ఆర్థిక సంవత్సరం బడ్జెట్ తయారీలో అనేక సవాళ్లు ఎదురయ్యాయనీ తెలిపారు. 27 పురపాలికలు జీహెచ్ఎంసీలో విలీనం తర్వాత వాటి లయబిలిటీ, అస్సెట్ ను లెక్కించామని చెప్పారు. ప్రాపర్టీ టాక్స్ అసెస్మెంట్, కలెక్షన్ ను ఎండ్ టు ఎండ్ పూర్తిగా ఆన్లైన్ చేశాం. కొత్తగా విలీన పురపాలికల్లో కూడా ఆన్లైన్ ప్రక్రియను పూర్తి చేస్తామని చెప్పారు. ప్రజా అవసరాలు, అభివృద్ధి కార్యక్రమాలు ఇలా అన్ని అంశాలను పరిగణలోనికి తీసుకుని బడ్జెట్ ను రూపొందించామని కమిషనర్ తెలిపారు.

జీహెచ్ఎంసీ బడ్జెట్ రూ. 11,460 కోట్లు

ఆమోదించిన జీహెచ్ఎంసీ కౌన్సిల్

2026-27 ఆర్థిక ఏడాది బడ్జెట్ ను కౌన్సిల్ లో జీహెచ్ఎంసీ ప్రవేశ పెట్టింది. జీహెచ్ఎంసీ మొత్తం బడ్జెట్ రూ. 11,460 కోట్లుగా పేర్కొంది. ఆదాయం రూ. 6,441 కోట్లు, జీహెచ్ఎంసీ ఖర్చు రూ. 4,057 కోట్లు, రెవెన్యూ మిగులు రూ.2,384 కోట్లు, రెవెన్యూ గ్రాంట్స్ రూ. 400 కోట్లు, కొత్తగా విలీనమైన మున్సిపాలిటీల కోసం రూ.2,260 కోట్లను కేటాయించింది. విలీనమైన 27 మున్సిపాలిటీల నుంచి వచ్చిన రెవెన్యూ రూ. 1,860 కోట్లుగా పేర్కొంది. జీహెచ్ఎంసీ బడ్జెట్ కు కౌన్సిల్ ఆమోదం తెలిపింది. ఈ సమావేశంలో ఎంపీ ఈటెల రాజేందర్ , ఎమ్మెల్సీలు అద్దంకి దయాకర్, మల్క కొమురయ్య, ఎమ్మెల్యే లు కాలే యాదయ్య, మీర్ జుల్ఫేకర్ అలీ, మాజిద్ హుస్సేన్, బండారి లక్ష్మారెడ్డి ,అదనపు కమిషనర్లు, జోనల్ కమిషనర్లు, విభాగాల ఉన్నతాధికారులు, తదితరులు పాల్గొన్నారు.



గ్రామీణ యువత క్రీడలపై దృష్టి పెట్టాలి

- సీఎం కప్ చైర్మన్ జయరాం

ప్రతిపక్షం, అక్కన్నపేట, జనవరి 31: గ్రామీణ యువత మత్తుకు దూరంగా ఉండి క్రీడల మైదానాల వైపు అడుగులు వేయాలని అక్కన్నపేట ఎంపీడీవో, సీఎం కప్ మండల స్థాయి పోటీల చైర్మన్ జయరాం అన్నారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సీఎం కప్ మండల స్థాయి కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ పోటీలు అక్కన్నపేట మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో రెండు రోజులపాటు నిర్వహించారు.ముగింపు సమావేశంలో విజేతలకు బహుమతులు అందజేస్తూ ఆయన మాట్లాడారు.సీఎం కప్ ద్వారా గ్రామీణ యువతలోని క్రీడా ప్రతిభ వెలుగులోకి వస్తుందని తెలిపారు.ఈ పోటీల్లో కబడ్డీ పురుషుల విభాగంలో కట్కూరు, మహిళా విభాగంలో మల్లంపల్లి, వాలీబాల్ పురుషుల విభాగంలో గౌరవెల్లి, మహిళా విభాగంలో గౌరవెల్లి, ఖోఖో మహిళా విభాగంలో అంతకపేట జట్లు విజేతలుగా నిలిచాయి.ఈ కార్యక్రమంలో ఆత్మ కమిటీ చైర్మన్ జంగాపల్లి ఐలయ్య, మండల విద్యాధికారి రంగనాయక్, ఎస్జీఎఫ్ సెక్రటరీ ఓం ప్రకాష్ రెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయులు, సర్పంచులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రైలు కిందపడి ముగ్గురు ఆత్మహత్య



ప్రతిపక్షం, హైదరాబాద్, జనవరి 31: హైదరాబాద్ మహానగరంలో హృదయవిదారక ఘటన ఒక టి వెలుగులోకి వచ్చింది. శివారు ప్రాంతం బోడుప్పల్ ప్రాంతానికి చెందిన ఒకే కుటుంబం బలవన్మరణానికి పాల్పడింది. ముగ్గురు వ్యక్తులు రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నారు. ఇందుకు సంబంధించి సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనాస్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు.భువనగిరి మండలం బొల్లెపల్లి గ్రామానికి చెందిన పి. సురేందర్‌రెడ్డి, ఆయన భార్య విజయ, కూతురు చేతన రెడ్డి హరితహారం కాలనీలో నివాసం ఉంటున్నారు. అయితే ముగ్గురు కుటుంబసభ్యులు శనివారం (జనవరి 31) ఉదయం చర్లపల్లి-ఘట్‌కేసర్ రైల్వే స్టేషన్ల మధ్య రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నారు. ఈ ఘటనపై సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు సంఘటనాస్థలానికి చేరుకుని ఛిద్రమైన ముగ్గురి మృతదేహాలను స్వాధీనం చేసుకున్నారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం సికింద్రాబాద్ గాంధీ ఆసుపత్రికి తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ ఆత్మహత్యకు గల కారణాలపై విచారణ కొనసాగుతోందని పోలీసులు తెలిపారు.



తమిళనాడు ఎన్నికల్లో తప్పకుండా గెలుస్తామని టీవీకే చీఫ్ విజయ్ వ్యాఖ్యలు హాస్యాస్పదం. విజయ్ కింగ్ కాదు. కేవలం ఓట్లను చీల్చుతారు. ఆ పార్టీతో బీజేపీ పొత్తు పెట్టుకునే అవకాశమే లేదు. గతంలో ఎంతో మంది సినీ స్టార్లు రాజకీయాల్లోకి వచ్చారు. కానీ విఫలమయ్యారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ, ఏఐడీఎంకే కలిసి పోటీ చేస్తాయి.

- కేంద్ర మంత్రి పీయూష్ గోయల్.

డిజిటల్ అడిక్షన్ ముప్పు

డిజిటల్ తెరపై కనిపించే ప్రతిదీ సత్యమేనన్న భావన నేటి సమాజంలో వేగంగా వ్యాపిస్తోంది. ఒక వీడియో వైరల్ అవుతుందంటే అది నిజమేనని, లక్షలాది చందాదారులున్నారంటే అది విశ్వసనీయతకు ముద్రని భావించే పరిస్థితి ఏర్పడింది. టి సాంకేతిక యుగంలో డిజిటల్ అడిక్షన్ పెను ముప్పుగా మారింది. చిన్నారుల నుంచి పెద్దల వరకు దాదాపు ప్రతి ఒక్కరూ స్మార్ట్‌ఫోన్లకు అతుక్కుపోవడంతో అనేక ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయి. నలుగురితో కలువడం తగ్గిపోయి కుటుంబ, స్నేహ బంధాలు బలహీనమవుతున్నాయి. చిన్నారుల్లో 'డిజిటల్ అడిక్షన్' విపరీతంగా పెరగడంపై కేంద్ర ఆర్థిక సర్వే 2025-26 తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. అయితే అల్గోరిథంల ఆధారంగా నడిచే డిజిటల్ ప్రపంచంలో సంఖ్యలు ఆకర్షణీయంగా కనిపించినంత మాత్రాన వాటి వెనుక ఉన్న వాస్తవం కూడా అంతే బలంగా ఉంటుందన్న గ్యారంటీ లేదు. సమాచార విప్లవం ప్రజలకు అవగాహన పెంచుతున్నప్పటికీ, అదే సమయంలో అప్రమత్తత లేకపోతే అవాస్తవాలకూ అవకాశం కల్పిస్తోంది. అందువల్ల మనం స్వీకరిస్తున్న సమాచారాన్ని విమర్శనాత్మకంగా పరిశీలించడం నేటి అత్యవసర అవసరంగా మారింది. భారతదేశంలో యూట్యూబ్ వినియోగం విస్తృతంగా పెరుగుతున్నది అన్నది నిర్వివాద సత్యం. కోట్లాది మంది ఈ వేదికను వార్తలు, వినోదం, అభిప్రాయాల కోసం వినియోగిస్తున్నారు. ప్రముఖ మీడియా సంస్థలు, సంగీత సంస్థలు భారీ సంఖ్యలో చందాదారులతో ముందంజలో ఉన్నాయి. అయితే చందాదారుల సంఖ్యకు, వాస్తవంగా వీడియోలను నిరంతరం వీక్షించే వారి సంఖ్యకు మధ్య వ్యత్యాసం ఉంటుందని అనేక డిజిటల్ విశ్లేషణలు సూచిస్తున్నాయి. అందువల్ల కేవలం గణాంకాల ఆధారంగా ఒక వ్యక్తి లేదా వేదిక ప్రభావాన్ని అంచనా వేయడం సరైన ప్రమాణం కాదన్న అభిప్రాయం బలపడుతోంది. నాణ్యమైన కంటెంట్, విశ్వసనీయత, వీక్షకులతో ఏర్పడే అనుబంధమే దీర్ఘకాలిక ప్రభావానికి కీలకంగా మారుతోంది. డిజిటల్ మాధ్యమాల్లో తప్పుడు సమాచారం వ్యాప్తిని నియంత్రించేందుకు భారత ప్రభుత్వం సమాచార సాంకేతిక నిబంధనలను అమల్లోకి తీసుకొచ్చింది. ప్రజా శాంతి, జాతీయ భద్రతకు భంగం కలిగించే కంటెంట్ పై చట్టపరమైన చర్యలు తీసుకునే అధికారం సంబంధిత సంస్థలకు ఉంది. గత కొన్నేళ్లలో నిబంధనలను ఉల్లంఘించిన పలు డిజిటల్ ఛానళ్లపై చర్యలు తీసుకున్నట్లు అధికారిక ప్రకటనలు వెలువడ్డాయి. ఇది డిజిటల్ మీడియా రంగం పూర్తిగా నియంత్రణల వెలుపల కాదన్న విషయాన్ని స్పష్టం చేస్తోంది. కాబట్టి కంటెంట్ సృష్టించే వారు చట్టపరమైన పరిమితులను గౌరవిస్తూ బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సిన అవసరం మరింత పెరిగింది. కృత్రిమ మేధ ఆధారిత వీడియోలు, ధ్రువీకరణ లేని సమాచారం, సంచలనాత్మక శీర్షికలు సమాజంపై ప్రతికూల ప్రభావంచూపే ప్రమాదం ఉంది. అధిక వీక్షణల కోసం బాధ్యతా రాహిత్యంగా రూపొందించే కంటెంట్ వ్యక్తిగత జీవితాలపైనా, సామాజిక శాంతిపైనా ప్రభావం చూపవచ్చు. ఈ పరిస్థితుల్లో సమాచారాన్ని అందించే క్రియేటర్ల నైతిక బాధ్యతతో పాటు, దాన్ని స్వీకరించే వీక్షకుల విజ్ఞత కూడా సమానంగా అవసరం. డిజిటల్ అక్షరాస్యతను పెంపొందించుకోవడం ద్వారానే తప్పుడు సమాచార ప్రభావాన్ని తగ్గించవచ్చు. మన దేశయువతలో సోషల్ మీడియా స్క్రోలింగ్, గేమింగ్ డిజార్డర్లు పెరుగుతున్నట్టు స్పష్టం చేసింది. వీటి వల్ల నిద్రలేమి, కోపం, సామాజిక బంధాలకు దూరంగా ఉండాలనే భావన అధికమై డిప్రెషన్‌కు లోనవుతున్నట్టు వివరించింది. 'టెలీ మానస్'కు ఏడాది కాలంలోనే 32 లక్షల ఫోన్‌కాల్స్ రావడంపై ఆర్థిక సర్వే ఆందోళన వ్యక్తం చేసింది.దేశంలో డిజిటల్ అడిక్షన్‌ను నిరోధించేందుకు ఇప్పటికే కొన్ని సంస్థలు చేపట్టిన కార్యక్రమాలను ఆర్థిక సర్వే ప్రస్తావించింది. పాఠశాలలు, స్కూలు బస్సుల్లో సురక్షిత ఇంటర్నెట్ వాడకానికి సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (సీబీఎస్ఈ), స్క్రీన్ టైమ్ లిమిట్, ఆన్‌లైన్ సేఫ్టీపై నేషనల్ కమిషన్ ఫర్ ప్రొటెక్షన్ ఆఫ్ చైల్డ్ రైట్స్ కొన్ని మార్గదర్శకాలు జారీచేసినట్టు వెల్లడించింది. డిజిటల్ అడిక్షన్‌ను తగ్గించేందుకు గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఆఫ్‌లైన్ యూత్ హబ్స్ ఏర్పాటు చేయాలని సర్వే సూచించింది. ఆయా ప్రదేశాల్లో ఆల్టర్నేట్ డిజిటల్ స్పేస్‌లు ఏర్పాటు చేయాలని తెలిపింది. పాఠశాలల్లో 'డిజిటల్ వెల్‌నెస్', సైబర్ సేఫ్టీ, మానసిక ఆరోగ్యంపై పాఠ్యాంశాలు బోధించాలని పేర్కొన్నది. డిజిటల్ అడిక్షన్‌తో మెదడుపై తీవ్ర ప్రభావం పడుతుంది. విద్యార్థులు చదువులో వెనుకబడతారు. సామాజిక సంబంధాలు తగ్గుతాయి. దీన్ని నిరోధించాలంటే స్క్రీన్‌టైమ్‌ను నియంత్రించుకోవాలి. రోజుకు కనీసం 12 గంటలు ఫోన్ లేకుండా గడపడం అలవాటు చేసుకోవాలి. ఫోన్‌కు బదులు నడక, క్రీడలు, యోగా వంటివి చేయాలి. మెదడులో డోపమైన్, సెరటోనిన్ లాంటి సానుకూల రసాయనాలు పెరగడం ద్వారా డిప్రెషన్ తగ్గుతుంది. నిద్రకు ఉపక్రమించే ముందు మొబైల్ వాడకూడదు. కనీసం గంట ముందే ఫోన్ చూడటం ఆపేయాలి. లేకుంటే స్క్రీన్ల నుంచి వెలువడే నీలి కాంతి మెలటోనిన్ హార్మోన్ల ఉత్పత్తిని తగ్గించి నిద్రకు ఆటంకం కలిగిస్తుంది. పిల్లలు చిరాకు పడటం, ఒంటరిగా ఫీల్ కావడం, చదువుపై ఆసక్తి తగ్గడం లాంటి లక్షణాలను డిజిటల్ అడిక్షన్‌కు సంకేతాలుగా భావించాలి. అవసరమైతే వైద్యనిపుణుల సహాయం తీసుకోవాలి.

ప్రతిపక్షం
హైదరాబాద్
ఆదివారం
01.02.2026

నిత్యం ప్రకాశించే ధృవతార కల్పనా చావ్లా

అంతరిక్షయానం చేసిన తొలి భారతీయ మరియు ఇండో-అమెరికన్ మహిళ వ్యోమగామిగా చరిత్ర సృష్టించిన కల్పనా చావ్లా కొలంబియా స్పేస్ షటిల్ ప్రమాదంలో మరణించి నేటికి సరిగ్గా ఇరవై మూడేళ్లు. యాత్ర ముగించుకుని వస్తుండగా 2003 ఫిబ్రవరి 1 న కొలంబియా వ్యోమనౌక కూలిపోవడంతో ఆమెతోపాటు మరో ఆరుగురు వ్యోమగాములు దుర్మరణం పాలయ్యారు.ఆమె గౌరవార్థం తమిళనాడు ప్రభుత్వం కల్పనా చావ్లా పురస్కారాన్ని 2003 నుంచి ఏటా ప్రకటిస్తోంది. దీన్ని వివిధ రంగాల్లో 15 మంది శక్తివంతమైన మహిళకు అందజేస్తుంది. భారతీయ అంతరిక్ష పరిశోధన కేంద్రం 2003లో ప్రయోగించిన మెట్ శాట్‌కు కల్పనా చావ్లా పేరు పెట్టారు.



సుధాకర్.ఏ.వి
9000674747

కల్పనా చావ్లా భారత దేశంలోని హర్యానా రాష్ట్రంలో కర్నాల్ పట్టణంలో 1962 మార్చి 17 న జన్మించింది. ఆమె పాఠశాలలో చేరినప్పుడు రికార్డుల ప్రకారం అధికార జన్మదినం జూలై 1 1961కి మార్చారు. తల్లిదండ్రులకు ఈమె చివరి సంతానం..ఇంట్లో అందరూ ముద్దుగా "మోంటు" అని పిలుచుకొనే కల్పనా చావ్లా తండ్రి బనారసీలాల్ చావ్లా సాధారణ వ్యాపారి,కల్పనపై ఆయన ప్రభావం ఎక్కువ. పేదరికం నుంచే ఆయన పైకెదిగారు. పట్టుదల అందుకు తగిన కృషి ఉంటే సాధించలేనిది ఏదీ లేదని నిరూపించిన వ్యక్తి ఆయన. చిన్నగా టైర్ల వ్యాపారాన్ని ప్రారంభించిన ఆయన తొలుత ఎన్నో కష్టనష్టాలకు గురయ్యారు.అయినా దాన్ని వదలకుండా అనుకున్నది సాధించేందుకు ముందుకు సాగిపోయారు. అప్పటి వరకూ టైర్ల తయారీకి విదేశీ యంత్రాన్ని ఉపయోగించేవారు. ఆ క్రమంలో ఆయన దేశీయంగానే ఆ యంత్రాన్ని రూపొందించారు. బనారసీలాల్ శ్రమ ఫలించింది. రాష్ట్రపతి నుంచీ అభినందనలు అందుకున్నారు. తర్వాత డబ్బు కోసం బనారసీ కుటుంబం ఇబ్బంది పడింది లేదు.ఆడపిల్లే అయినా జీవితంలో ఏదో సాధించాలన్న తపన కల్పనలో పాదుకోవడానికి తండ్రే కారణం. "పరిస్థితులు ఎలాగున్నా కన్న కలల్ని నిజం చేసుకోవడమే అంతిమ లక్ష్యం అన్న మాటలు నా తండ్రి జీవితంలో నిజమయ్యాయి. ఫలితంగా అవే నాలోనూ జీర్ణించుకుకపోయాయి. అందుకు నాన్నే కారణం." అంటూ తొలి అంతరిక్షయానం తర్వాత జరిగిన ముఖాముఖిలో తన ఆలోచనలు ఏ విధంగా ప్రభావితమయిందీ కల్పన వివరించారు.

కల్పనా చావ్లా ముందుగా కర్నాల్ లో ఉన్న టైగోర్ పబ్లిక్ స్కూల్లో చదువుకున్నారు.తోటి పిల్లలంతా కామిక్ పుస్తకాలు చదువుతూ బార్బీ బొమ్మల్లా అలంకరించుకునే వయసులో ఆమె తెల్లవారు జామునే లేచి సైకిల్ పై బడికెళ్ళేవారు.బళ్ళో చిత్రలేఖన పాఠాలలో విమానం బొమ్మలు గీయటానికి ఇష్టపడేవారు. ఈమె సోదరుడు సంజయ్ చావ్లా కమర్షియల్ పైలట్ కావాలని కలలు కనేవాడు. తన గదిలో విమానాల బొమ్మలుంచేవాడు. అవి కల్పనలో స్ఫూర్తిని కలిగించాయి. కల్పన తన కలల్ని నిజం చేసుకోవటానికి ఈమె సోదరుడు సంజయ్ ప్రోత్సాహం ఎంతో ఉంది. ఇద్దరి కలలూ ఒకటే ఆకాశంలో ఎగరడం.

పంజాబ్ ఇంజరీరింగ్ కాలేజీలో ఏరోనాటికల్ ఇంజనీరింగ్ చేశారు.1982 లో ఈమె అమెరికా వెళ్లి అక్కడ టెక్సాస్ విశ్వవిద్యాలయం నుండి "ఏరోస్పేస్ ఇంజనీరింగు"లో మాస్టర్స్ డిగ్రీని 1984లో పొందారు. 1986 లో చావ్లా రెండవ మాస్టర్ అఫ్ సైన్సు డిగ్రీని , ఏరోస్పేస్ ఇంజనీరింగ్ లో పి హెచ్ .డి ని బౌల్డర్ లో ఉన్న కోలోరాడో విశ్వవిద్యాలయం నుంచి పొందారు. అందమైన భవిష్యత్ కోసం కలలు కంటూ గాలిలో మేడలు కట్టకుండా జీవిత లక్ష్యాన్ని సాధించుకున్న మహిళ కల్పనా చావ్లా. చదువులో ఎప్పుడూ ముందు ఉండేది. ఈమెను ఎక్స్‌ట్రావెర్ట్ గా ఉపాధ్యాయులు పేర్కొనేవారు. సహజంగా ఒక వ్యక్తి 20 నుండి 30 సంవత్సరాల మధ్య వయసులో కెరియర్ ను ప్రారంభించినా, అప్పటి నుంచి ఓ 15 ఏళ్ళు కష్టపడితే గాని పేరు రాదు. కానీ కల్పన పిన్నవయసులోనే గొప్ప వ్యక్తిగా పేరు తెచ్చుకున్నారు. ఈమె నాసాలో ఉద్యోగానికి దరఖాస్తు చేసినపుడు ఈమెతో 2 వేల మంది పోటీ పడ్డారు.అయితే ఈమె మాత్రమే నాసా శాస్త్రవేత్తగా ఎంపికయ్యారు.

ఆమె కాలిఫోర్నియాలో ఓ కంపెనీ ఉపాధ్యక్షురాలిగా పని చేసారు. పరిశోధన శాస్త్రవేత్తగా అక్కడెంతో అనుభవం గడించారు. ఏరో డైనమిక్స్ ఉపయోగానికి సంబంధించిన సమర్థమైన మెళకువలు నేర్చుకున్నారు. సిమ్యులేషన్, అనాలసిస్ ఆఫ్ ఫ్లో ఫిజిక్స్ తదితర వైవిధ్యమున్న అంశాలను శోధించారు. ఇదతా నేషనల్ ఏరోనాటిక్స్ అండ్ స్పేస్ అడ్మినిస్ట్రేషన్ (నాసా) కు దరఖాస్తు చేయకముందే జరిగింది. ఆమె 1983 లో విమానయాన శిక్షకుడు, విమాన చోదక శాస్త్ర రచయిత ఐన జీన్‌పియర్ హారిసన్ ను వివాహం చేసుకున్నారు, 1990 లో యునైటెడ్ స్టేట్స్ దేశ పౌరసత్వం పొందారు. స్నేహితులన్నా, కుటుంబ సభ్యులన్నా, చదువు చెప్పిన ఉపాధ్యాయులన్నా కల్పనకు ఎనలేని అభిమానం. ఎక్కడున్నా మనసుకు దగ్గరైన వారందరితోనూ భావాలను పంచుకునేవారు. కొత్త కొత్త లోకాలకు వెళుతున్నట్లు భావిస్తూ ఊహల లోకాల్లో విహరించేది. తరచూ స్నేహితులందరితో కలసి పార్కులకు వెళుతుండేది. అలా ఒకసారి పార్కుకు వెళ్ళిన కల్పనా ..." మనం ఇక్కడ లేనట్లు ఊహించుకుందాం. ఇపుడు ఎక్కడో తెలియని దిగంతాల ఆవలికి వెళ్ళిపోయాం. అక్కడే ఎంతో ఆనందంగా ఉన్నాం" అంటూ తనతో పాటు స్నేహితులను కూడా ఊహాలోకాల్లోకి తీసుకుపోయేవారు. ఈమె ఊహలు ఈమె ఊహించని దానికన్నా ఎక్కువగా .... తీరాలను దాటి వెళ్ళాయి. తర్వాత్తర్వాత ఈమె వ్యోమగామిగా, అంతరిక్ష శాస్త్రవేత్తగా ఎదగడానికి పునాదిగా ఈ ఊహలే ఉపకరించాయి.

1997 లో కల్పనా చావ్లా అంతరిక్ష యానం చేసిన మొదటి భారతీయ మహిళగా చరిత్ర సృష్టించారు. అప్పుడీమే 376 గంటల పాటు అంతరిక్షంలో గడిపారు. భూమి చుట్టూ 252 సార్లు పరిభ్రమించి, 6.5 మిలియన్ మైళ్ళు అంతరిక్ష యానం చేశారు. నాసా వ్యోమగామిగా కల్పనను ఎంపిక చేసేటప్పుడు ఒక తమాషా సంఘటన జరిగింది. అదేమిటంటే ఈమెకు వైద్య పరీక్షలు చేశారు. ఒక వైద్యుడు ఈమె ఎక్స్‌రే పరిశీలిస్తూ "నువ్వు శాఖాహారివా?" అంటూ ప్రశ్నించారు. "అవును, నేనెప్పుడూ మాంసం ముట్టలేదు" అని కల్పన జవాబిచ్చారు. "అది ఎక్స్‌రే చూడగానే తెలిసిందిలే. ఎందుకంటే లోపలంతా చాలా స్వచ్ఛంగా, పరిశుభ్రంగా ఉంది" అంటూ ఆయన పెద్దగా నవ్వేశారు. యాత్ర ముగించుకుని వస్తుండగా 2003 ఫిబ్రవరి 1 న కొలంబియా వ్యోమనౌక కూలిపోవడంతో ఆమెతోపాటు మరో ఆరుగురు వ్యోమగాములు దుర్మరణం పాలయ్యారు.ఆమె గౌరవార్థం తమిళనాడు ప్రభుత్వం కల్పనా చావ్లా పురస్కారాన్ని 2003 నుంచి ఏటా ప్రకటిస్తోంది. దీన్ని వివిధ రంగాల్లో 15 మంది శక్తివంతమైన మహిళకు అందజేస్తుంది. భారతీయ అంతరిక్ష పరిశోధన కేంద్రం 2003లో ప్రయోగించిన మెట్ శాట్‌కు కల్పనా చావ్లా పేరు పెట్టారు.



(ఫిబ్రవరి 1 కల్పనా చావ్లా వర్ధంతి)

వ్యాస రచయిత రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు
స్టేట్ టీచర్స్ యూనియన్ తెలంగాణ

సంపన్న భారతాన్ని వెక్కిరిస్తున్న ఆకలి కేకలు!



వెంక గారి భూమయ్య
9848559863

నవ భారతం ఆర్థిక పటంలో అగ్రగామిగా వెలుగులీనుతోందని పాలకులు వల్లెవేస్తున్న గణంకాల వెనుక, అగాధమైన పేదరికపు చీకట్లు ముసురుకున్నాయనేది నిష్ఠుర సత్యం. సుమారు 147 కోట్ల జనాభా కలిగిన ఈ దేశంలో 28 శాతం మంది ప్రజలు నేటికీ కనీస అవసరాల కోసం దైన్యంగా అలమటిస్తుండటం మన ప్రజాస్వామ్య వైఫల్యానికి నిలువుటద్దం. పూర్వం కృష్ణమీనన్ వ్యాఖ్యానించినట్లు, దేశం సంపన్నమైనదే అయినప్పటికీ, వనరుల అసమాన పంపిణీ కారణంగా భారతీయులు నిరుపేదలుగా మిగిలిపోతున్నారు. పేదరికం అనేది కేవలం ఒక ఆర్థిక లోపం కాదు; అది మనిషి ప్రాథమిక హక్కులను, ఆత్మాభిమానాన్ని కాలరాస్తూ, లోలోపల నుంచి మనిషిని ఛిద్రం చేసే ఒక భయంకరమైన సామాజిక క్యాన్సర్. ఆత్మగౌరవంతో బతికే దారి లేక, ఆకలి మంటలను ఆర్పలేక గతేడాది లక్షా డెబ్బై వేల మందికి పైగా అభాగ్యులు బలవన్మరణాలకు పాల్పడటం మన దేశ ప్రగతిపై పడుతున్న నెత్తుటి మరక. అందులో నలభై శాతం మరణాలకు కారణం పేదరికమేనని తేలడం మన వ్యవస్థల నిర్లక్ష్యానికి పరాకాష్ఠ. నేటి భారతదేశంలో నెలకొన్న ఆర్థిక వ్యత్యాసాలు వలసపాలన నాటి దోపిడీని తలపిస్తున్నాయి. దేశ సంపదలో సగానికి పైగా వాటాను కేవలం పది శాతం మంది కుబేరులే కబళించివేస్తుండటం, సామాన్యుడిని మరింత దారిద్ర్యంలోకి నెట్టివేస్తోంది. 2026 అంతర్జాతీయ అసమానతల నివేదిక సాక్షిగా, పేదరికం గణనీయంగా తగ్గిందని చెప్పుకునే పాలకుల వాదనలు కేవలం బూటకమని అర్థమవుతోంది. కార్పొరేట్ శక్తులకు లక్షల కోట్ల రూపాయల రాయితీలను కట్టబెడుతున్న ప్రభుత్వాలు, పేదలకు జీవనాధారమైన సంక్షేమ పథకాలపై కోత విధిస్తూ వారిని మరింత అణచివేస్తున్నాయి. పార్వతీపురం మన్యం జిల్లాలో ఓ దళిత కుటుంబం సామూహికంగా ప్రాణాలు వదలడం, మరణించిన వృద్ధురాలిని చెత్త రిక్షాలో తరలించాల్సిన దుస్థితి తలెత్తడం——మనం ఏ రకమైన నాగరికతలో ఉన్నామోనని ప్రశ్నిస్తున్నాయి. ఇది కేవలం పేదరికం కాదు, మానవత్వం మంటగలిసిన వ్యవస్థాగత హత్యలే. రూపాయి విలువ చరిత్రలో ఎన్నడూ లేనంతగా కుప్పకూలిపోతుంటే, పాలనా యంత్రాంగం మాత్రం 'మేడిపండు' చందంగా భ్రమలను కల్పిస్తోంది. వ్యవసాయ రంగం తీవ్రమైన సంక్షోభంలో కూరుకుపోవడం, విద్య మరియు వైద్యం వంటి కనీస అవసరాలు కార్పొరేట్ శక్తులకు బానిసలై సామాన్యుడికి అందుబాటులో లేకుండా పోవడం వల్ల మధ్యతరగతి సైతం నిరుపేదలుగా మారుతోంది. ప్రపంచ ఆకలి సూచీలో మన దేశం పాతాళానికి పడిపోతుండటం అభివృద్ధి నినాదాల వెనుక ఉన్న డొల్లతనాన్ని ఎండగడుతోంది. ఫోర్బ్స్ జాబితాలో బిలియనీర్ల సంఖ్య పెరగడం దేశాభివృద్ధికి సంకేతం కాదు, అది కోత విధించడం ద్వారా గ్రామీణ జీవనోపాధిని దెబ్బతీస్తూనే, మరోవైపు విదేశీ పెట్టుబడుల గురించి గొప్పలు చెప్పుకోవడం హాస్యాస్పదం. సామాన్యుడి పన్నులతో సేకరించిన నిధులను బడా వ్యాపారవేత్తల అప్పుల మాఫీకి వాడటం ఏ రకమైన ఆర్థిక నీతి? ఇది పేదవాడి కంచంలోని మెతుకును దొంగలించి, కుబేరుల తివాచీలకు రంగులు వేయడమే. ఇటువంటి క్లిష్ట సమయంలోనూ కేరళ వంటి రాష్ట్రాలు పేదరిక నిర్మూలనలో ముందడుగు వేయడం చూస్తుంటే, మార్పు సాధ్యమేననిపిస్తుంది. కానీ, అందుకు పాలకుల్లో కావలసింది చిత్తశుద్ధితో కూడిన సంకల్పం. రాయప్రోలు సుబ్బారావు గారు కలలు గన్నట్లు, ఆకలితో అలమటించే కడుపులకు గరిటెడు గంజి, మానాన్ని కాపాడే గుడ్డ లభించే రోజులను వెతకాల్సిన బాధ్యత పాలకులపై



సంపద కేంద్రీకరణకు నిదర్శనం. అమర్త్యసేన్ పేర్కొన్నట్లుగా, సంపద సృష్టించడం గొప్ప కాదు, దానిని న్యాయబద్ధంగా పంపిణీ చేయడంలోనే సామాజిక న్యాయం దాగి ఉంది. ఈ వ్యవస్థాగత వైఫల్యం కేవలం గణాంకాలకే పరిమితం కాలేదు. అభివృద్ధి అనే రథం కేవలం సంపన్నుల మేడల ముందు మాత్రమే ఆగుతోంది. గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయం కునారిల్లి, రైతులు కౌలు రైతులుగా, కౌలు రైతులు కూలీలుగా మారుతున్న క్రమంలో వారి కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి. ఉపాధి హామీ పథకానికి నిధుల ఉంది. అభివృద్ధి ఫలాలు కొద్దిమంది ఇళ్లలోనే కాకుండా, అట్టడుగు వర్గాల ముంగిటకు చేరాలి. కేవలం అంకెలు, రంగుల ప్రకటనలు పేదవాడి ఆకలిని తీర్చలేవు. దేశ సంపద సార్వజనీనం కావాలి, అప్పుడే భారత్ పేదరికం అనే భూతం నుంచి విముక్తి పొందుతుంది. ఇందుకు కావలసింది నినాదాలు కాదు, నిర్మాణాత్మకమైన మార్పు మరియు నిస్వార్థమైన పాలన. అప్పుడు మాత్రమే 'సంపన్న భారతం' అనే మాటకు నిజమైన సార్థకత చేకూరుతుంది.

(వ్యాసరచయిత సీనియర్ జర్నలిస్ట్)

సీపీఆర్ పై అవగాహన అవసరం



మలిపెద్ది పవన్ కళ్యాణ్
7093052815

ప్రస్తుత ఉరుకుల పరుగుల జీవితంలో కార్డియాక్ అరెస్ట్,హార్ట్ ఎటాక్ అనేది సాధారణ విషయమైంది.వయసుతో సంబంధం లేకుండా వృద్ధులకు,యువత, మధ్య వయసువారు, పిల్లలు కూడా అకస్మాత్తుగా గుండెపోటుకు గురవుతున్న ఘటనలు రోజు రోజుకు పెరుగుతున్నాయి. ఇది కేవలం వైద్య సమస్య కాదు ఇది ఒక సామాజిక అత్యవసర సమస్యగా మారింది.వైద్య నిపుణులు చెప్పే దాని ప్రకారం హార్ట్ అటాక్ వచ్చిన వెంటనే సరైన సమయంలో సీపీఆర్ (కార్డియో పల్మనరీ రిసస్సిటేషన్) చేయగలిగితే ప్రాణాలు కాపాడే అవకాశాలు చాలా ఎక్కువ.సీపీఆర్ అనేది గుండెపోటు లేదా శ్వాస ఆగిపోయిన అత్యవసర స్థితిలో ప్రాణాలను రక్షించే ప్రాథమిక వైద్య ప్రక్రియ కానీ దురదృష్టవశాత్తు, మన సమాజంలో సీపీఆర్ పై అవగాహన చాలా తక్కువగా ఉంది.ఎవరైనా కుప్పకూలినప్పుడు ప్రజలు సహాయం చేయకుండా భయంతో,అయోమయంలో నిలబడిపోతున్నారు.కొందరు వీడియోలు తీయడంలో నిమగ్నమవుతున్నారు. మరికొందరు "ఏం చేయాలో తెలియదు" అంటూ విలువైన నిమిషాలను వృథా చేస్తున్నారు. ఈ నిర్లక్ష్యమే అనేక ప్రాణనష్టాలకు కారణమవుతోంది.

గోల్డెన్ అవర్ ప్రాణాలు నిలబెట్టే కీలక సమయం

హార్ట్ అటాక్ తర్వాత మొదటి ఒక గంటను వైద్యులు "గోల్డెన్ అవర్"గా పేర్కొంటారు. ఈ కీలక సమయంలో సిపిఆర్ ప్రారంభమైతే, వెంటనే హాస్పిటల్‌కు తరలిస్తే, బాధితుడు మళ్లీ సాధారణ జీవితానికి చేరుకునే అవకాశముంది.కానీ అవగాహన లేనందున ఆ గోల్డెన్ అవర్ మన చేతుల మధ్యనే జారిపోతోంది.సిపిఆర్ అవసరం కేవలం హార్ట్ అటాక్‌లకే పరిమితం కాదు. వైద్య నిపుణుల ప్రకారం, కరెంట్ షాక్ తగిలి వ్యక్తి స్పృహ కోల్పోయి శ్వాస ఆగిపోయిన పరిస్థితిలో, పరిసరాలు సురక్షితంగా ఉన్నట్లయితే సిపిఆర్ చేయవచ్చు.అయితే ముందుగా విద్యుత్ సరఫరా పూర్తిగా నిలిపివేయడం అత్యంత ముఖ్యం.

సీపీఆర్ ఎలా చేయాలి..?

1) స్పందన ఉందా లేదా చూడాలి ఆ వ్యక్తిని పిలుస్తూ భుజాన్ని మెల్లగా కదిలించి స్పందిస్తున్నాడా చూడాలి.

2) శ్వాస ఉందా లేదా పరిశీలించాలి ఛాతీ కదులుతోందా? శ్వాస వస్తోందా? లేకపోతే వెంటనే చర్య తీసుకోవాలి.

3) వెంటనే అంబులెన్స్‌కు (108)కు కాల్ చేయాలి ఇది అత్యంత కీలకమైన దశ.

4) ఛాతిపై ఒత్తిడి (చెస్ట్ కాంప్రెషన్స్) ఇవ్వాలి బాధితుడిని సమానమైన నేలపై పడుకోబెట్టాలి ఛాతి మధ్యభాగంపై రెండు చేతులు ఉంచి నిమిషానికి సుమారు 100 నుంచి 120 సార్లు 5-6 సెం.మీ లోతుగా ఒత్తిడి ఇవ్వాలి స్పృహ వచ్చే వరకు ఆపకుండా ఈ ప్రక్రియ కొనసాగించాలి

5) శ్వాస ఇచ్చే పద్ధతి తెలిసి ఉంటే మాత్రమే ఇవ్వాలి లేకుంటే ఛాతి ఒత్తిడి కొనసాగిస్తే సరిపోతుంది

అవగాహన ఉద్యమంగా మారాల్సిన అవసరం ఎంతైనా ఉంది

ఇక్కడ ప్రభుత్వ వ్యవస్థ బాధ్యత మరింత అవసరం. పోలీస్ శాఖ, ఆరోగ్య శాఖ కలిసి సీపీఆర్ పై విస్తృత అవగాహన



కార్యక్రమాలు చేపట్టాలి. పాఠశాలలు, కళాశాలలు, గ్రామ సభలు, బస్టాండ్‌లు,కార్యాలయాలు వంటి ప్రజలు ఎక్కువగా చేరే ప్రాంతాల్లో ప్రాక్టికల్ శిక్షణ ఇవ్వాలి.సీపీఆర్ అనేది డాక్టర్లకే కాదు ప్రతి సాధారణ పౌరుడికీ తెలిసి ఉండాల్సిన మౌలిక జీవన నైపుణ్యంగా మారాలి. ఇది ఖర్చుతో కూడిన కార్యక్రమం కాదు. కానీ దీని వల్ల లభించే ఫలితం అమూల్యమైనది ఒక మనిషి ప్రాణం.ప్రభుత్వం మాత్రమే కాదు... మీడియా, స్వచ్ఛంద సంస్థలు, ఉపాధ్యాయులు, సామాజిక కార్యకర్తలు అందరూ కలిసి సీపీఆర్ అవగాహనను ఉద్యమంలా ప్రజల్లోకి తీసుకెళ్లాలి. ఎందుకంటే రేపు సహాయం అవసరమయ్యేది ఎవరికో తెలియదు అది మనకైనా కావచ్చు, మన కుటుంబ సభ్యులకైనా కావచ్చు.అవగాహన ఒక ఆయుధం.సీపీఆర్ ఒక జీవన రక్షణ విద్య.ఇప్పుడు నేర్చుకోకపోతే తర్వాత పశ్చాత్తాపమే మిగులుతుంది.

(వ్యాస రచయిత జర్నలిస్టు, గుండాల)

రచయితలకు మనవి

ప్రతిపక్షం ఎడిట్ పేజీ 'ఓపెన్ వాయిస్'కు, సాహిత్య పేజీ 'బహుళ'కు తమ రచనలు పంపగోరువారు ఈ కింది చిరునామాకు పంపించగలరు. వీలును బట్టి ప్రచురించగలము. పుస్తక సమీక్షకులు మా చిరునామాకు పోస్టు ద్వారా గానీ, కొరియర్ ద్వారా గానీ రెండు పుస్తకములు తప్పక పంపించగలరు.

రచనలు పంపాల్సిన చిరునామా

ppbahula
@gmail.com
9010223917

ADRESS
Editor,
Prathipaksham,
Telugu Daily
8-1-284/
OU/521/7/9,
OU Colony,
Shaikpet,
Hyderabad,
Telangana
500008

ప్రాంతీయం

మధ్యాహ్న భోజనంపై జిల్లా కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

ప్రతిపక్షం బ్యూరో సిద్దిపేట జనవరి 31:

సిద్దిపేట అర్బన్ మండలం మిట్టపల్లి వద్ద గల కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ)తో పాటు సమీపంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల, జూనియర్ కళాశాలను జిల్లా కలెక్టర్ కె. హైమావతి శుక్రవారం ఆకస్మికంగా సందర్శించారు.ఈ సందర్భంగా కేజీబీవీలో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని జిల్లా కలెక్టర్ పరిశీలించారు. అన్నం, గుడ్డు, క్యాలీఫ్లవర్ కూర, పప్పు, రసం, పెరుగులను పరిశీలించి నాణ్యతపై ఆరా తీశారు. విద్యార్థులకు డైనింగ్ హాల్‌లోనే భోజనం వడ్డించాలని, ఇతర ప్రాంతాల్లో వడ్డించరాదని సంబంధిత అధికారులను ఆదేశించారు. విద్యార్థులతో మాట్లాడుతూ భోజనం చేసే సమయంలో క్రమశిక్షణతో కూడిన మంచి అలవాట్లు అలవర్చుకోవాలని సూచించారు. విద్యార్థులు మరల అన్నం లేదా కూరలు



కోరినప్పుడు వారు కూర్చున్న చోటికే వెళ్లి వడ్డించాలని వంట సిబ్బందికి సూచించారు. కామన్ డైట్ మెనూను తప్పనిసరిగా పాటిస్తూ, నాణ్యమైన మరియు రుచికరమైన ఆహారాన్ని విద్యార్థులు కడుపునిండా తినేలా వండించాలని ప్రిన్సిపాల్‌ను ఆదేశించారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.వంట గది,పరిసరాలు ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచాలని, ఈగలు, దోమలు రాకుండా డెటాల్ వంటి శానిటైజర్లతో క్రమం తప్పకుండా శుభ్రపరచాలని వంట సిబ్బందిని ఆదేశించారు. విద్యాలయంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు ఎల్లప్పుడూ సక్రమంగా పనిచేసేలా చూడాలని తెలిపారు. అనంతరం సమీపంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల ,జూనియర్ కళాశాలను జిల్లా కలెక్టర్ సందర్శించి అక్కడ కూడా మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. కూరల నాణ్యతను మరింత మెరుగుపరచాలని, నిర్లక్ష్యంగా వంట చేసి విద్యార్థులకు ఆహారం అందిస్తే ఉపేక్షించబోమని స్పష్టం చేశారు. నాణ్యమైన సరుకులతో రుచికరమైన ఆహారాన్ని వండి విద్యార్థులకు అందించాలని, డైనింగ్ హాల్‌తో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సిబ్బందిని ఆదేశించారు.



జిల్లాలో ముగిసిన నామినేషన్ల పర్వం

ప్రతిపక్షం బ్యూరో, నిజామాబాద్, జనవరి 31 :

జిల్లాలోని నిజామాబాద్, ఆర్మూర్, భీంగల్, బోధన్ మున్సిపల్లో మొత్తం 146 వార్డులు ఉండగా 1242 మంది అభ్యర్థులు 1729 నామినేషన్లు దాఖాలు చేశారు. ఇందులో ఆప్ 9, బీఎస్పీ 267, బీజేపీ 149, సీపీఐ(ఎం) 8, కాంగ్రెస్ 584, ఎఐఏఎం 148, బీఆర్ఎస్ 302, టీడీపీ 2, ఇతరులు 88, స్వతంత్ర్యులు 172, మొత్తం 1729 నామినేషన్లు దాఖాలు అయ్యాయి. జిల్లాలో మున్సిపల్ ఎన్నికల నామినేషన్ల ఘట్టం ముగిసింది. శుక్రవారం రాత్రి వరకు నామినేషన్ల ప్రక్రియ ముగిసింది. ఇందులో భాగంగా నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్లో 60 డివిజన్లకు గాను మొత్తం 657 మంది అభ్యర్థులు నామినేషన్లు వేశారు. ఇందులో కొంతమంది రెండు చొప్పున నామినేషన్లు వేయటంతో 976 నామినేషన్లు దాఖాలు అయ్యాయి. పార్టీల వారిగా వేసిన నామినేషన్లు ఇలా ఉన్నాయి.ఆప్ 3, బీఎస్పీ 5, బీజేపీ 253, సీపీఐ 5, కాంగ్రెస్ 319, ఏఎంఐఎం 79. బీఆర్ఎస్ 120, టీడీపీ 2. ఇతరులు 72. స్వతంత్ర అభ్యర్థులు 118, మొత్తం 976 మంది నామినేషన్లు వేశారు. మున్సిపల్ వారిగా నామినేషన్లు వచ్చిన వివరాలు ఇలా ఉన్నాయి.

ఆర్మూర్ మున్సిపల్ లో

మొత్తం 36 వార్డులు ఉండగా 195 మంది అభ్యర్థులు 298 నామినేషన్లు వేశారు. ఇందులో ఆప్ 4, బీఎస్ పీ 5, బీజేపీ 73, సీపీఐ(ఎం) 1, కాంగ్రెస్ 114, ఎఐఏఎం 7, బీఆర్ఎస్ 65, ఇతరులు 4, స్వతంత్ర్య 25, మొత్తం 298 నామినేషన్లు.

బోధన్ మున్సిపల్...

మొత్తం 38 వార్డులు ఉండగా 315 మంది 342 నామినేషన్లు వేశారు. ఇందులో ఆప్ 2, బీఎస్పీ 4, బీజేపీ 43, సీఐపీ (ఎం) 2, కాంగ్రెస్ 112, ఎఐఏఎం 62, బీఆర్ఎస్ 90, ఇతరులు 8. స్వతంత్ర్యులు 19, మొత్తం 342 మంది నామినేషన్లు వచ్చాయి.

భీంగల్ మున్సిపాలిటీలో...

మొత్తం 12 వార్డులు ఉండగా, 75 మంది అభ్యర్థులు 113 నామినేషన్లు దాఖలు చేశారు. ఇందులో బీఎస్పి 5, బీజేపీ 28, కాంగ్రెస్ 39, బీఆర్ఎస్ 27 ఇతరులు 4, స్వతంత్ర 10 మొత్తం 113 నామినేషన్లు దాఖలు అయ్యాయి.



సూపర్వైజర్లు, బీఎల్‌వోలు క్షేత్రస్థాయిలో

సమర్థవంతంగా పని చేయాలి

- **అదనపు కలెక్టర్ అంకిత్**

ప్రతిపక్షం బ్యూరో, నిజామాబాద్, జనవరి 31 :

ఓటర్ల జాబితా సవరణలో భాగంగా చేపట్టిన ప్రక్రియను నిర్ణీత గడువులో వేగవంతంగా, తప్పిదాలకు తావు లేకుండా పూర్తి చేసేందుకు సూపర్వైజర్లు, బీఎల్‌వోలు క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా పనిచేసేలా అన్ని చర్యలు చేపట్టామని అదనపు కలెక్టర్ అంకిత్ తెలిపారు. శనివారం హైదరాబాద్ నుండి రాష్ట్ర ఎన్నికల అధికారులతో కలిసి రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎన్నికల అధికారులతో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ సన్నాహక ప్రక్రియ పురోగతిపై సమీక్ష నిర్వహించారు.

ఈ సందర్భంగా సీ ఈ ఓ మాట్లాడుతూ, ఓటర్ల జాబితా సవరణకు చేపట్టిన ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఓటర్ మ్యాపింగ్‌లో ఎలాంటి తప్పిదాలకు అవకాశం లేకుండా ఈఆర్‌వోలు (EROs) సమగ్ర పర్యవేక్షణ చేపట్టి, సకాలంలో పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న అదనపు కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ, ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా నిర్ణీత గడువులో ఈ ప్రక్రియ పూర్తి చేస్తామని తెలిపారు. బీఎల్‌వోలు, సూపర్వైజర్లకు స్పష్టమైన లక్ష్యాలు నిర్దేశించి, క్షేత్రస్థాయిలో ప్రక్రియ వేగంగా సాగేలా పర్యవేక్షణను మరింత పటిష్టం చేశామని చెప్పారు. వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్(రెవెన్యూ) కిరణ్ కుమార్, సబ్ కలెక్టర్ అభిగ్యాన్ మాల్వియ, ఆర్డీఓ రాజేంద్ర కుమార్, ఎన్నికల విభాగం అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పదవి విరమణ చేసిన పోలీస్ సిబ్బందికి సీపీ వీడ్కోల్

ప్రతిపక్షం బ్యూరో, నిజామాబాద్, జనవరి 31 :

నిజామాబాద్ పోలీస్ శాఖలో సుదీర్ఘ కాలంగా పనిచేసి పదవి విరమణ పొందిన పోలీస్ సిబ్బందికి జిల్లా పోలీస్ కమిషనర్ సాయి చైతన్య సన్మానించి వీడ్కోలు పలికారు. జి.రాజు ఎస్సై, పోలీస్ కంట్రోల్ రూమ్ (అటాచ్ మెంట్),ఎస్ చిన్నన్న ఏఎస్ఐ, మహిళా పోలీస్ స్టేషన్ నిజామాబాద్, సి సాయన్న ఆర్ఎస్ఐ ఏఆర్ హెడ్ క్వార్టర్స్ నిజామాబాద్ పదవి విరమణ పొందారు. ఈ సందర్భంగా వీరికి పోలీస్ కమిషనర్ కార్యాలయంలో వీడ్కోలు కార్యాక్రమం నిర్వహించారు. వీరికి సీపీ శాలువలతో సత్కరించి "పదవి విరమణ శుభాకాంక్షలు సర్టిఫికేటు (జ్ఞాపికలతో) "ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ సాయి చైతన్య మాట్లాడుతూ పోలీస్ శాఖలో ఎంతో పనివత్తిడితో విధులు నిర్వహించి ఎలాంటి రిమార్కు లేకుండా పదవి విరమణ చేయడం ఎంతో గొప్ప విషయమని ప్రతీ ప్రభుత్వ ఉద్యోగికి పదవి విరమణ తప్పక ఉంటుందని, మీరు పోలీస్ డిపార్టుమెంటు కు చేసిన సేవలు



ఎంతో ఘనమైనయమని పదవి విరమణ అనంతరము మీకు ఎలాంటి అవసరం వచ్చిన మీకు ఎల్లవేళల సహాయపడుతామన్నారు. మీ కుటుంబ సభ్యులు అయురారోగ్యాలతో ఉండాలని, మీ పిల్లల భవిష్యత్తుభాగుండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆఫీస్ సూపరిండెంట్లు శంకర్, శ్రీనివాస్, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ ll కే శ్రీధర్ రెడ్డి, రిజర్వు ఇన్స్పెక్టర్ సతీష్, తిరుపతి, షకీల్ పాషా, పదవి విరమణ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్యం కోసం ఎల్‌ఓసి పత్రాలు అందజేసిన ఎమ్మెల్యే ధన్ పాల్

ప్రతిపక్షం బ్యూరో, నిజామాబాద్, జనవరి 31 :

అర్హులైన ఓ పేద రోగికి అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్య నారాయణ అండగా నిలిచి ఎల్ ఓసి పత్రాలను అందజేశారు. వివరాలు ఇలా ఉన్నాయి... అర్బన్ నియోజకవర్గానికి చెందిన గౌతమ్ నగర్ నివాసి షేక్ బాబు మియా తీవ్రమైన అనారోగ్యంతో బాధపడుతూ, హైదరాబాద్‌లోని నిమ్స్ పంజాగుట్ట ఆసుపత్రిలో అత్యవసర శస్త్రచికిత్స చేయించుకున్నారు. దీంతో బాధితుడికి బ్రౌన్ శస్త్రచికిత్స, కొలొస్టోమీ, దీర్ఘకాల ఐసీయూ చికిత్స, రక్త మార్పిడి వంటి



వైద్య సేవల కోసం సుమారు రూ.10 లక్షల వరకు ఖర్చు అవుతుండటంతో, ఆ కుటుంబం తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటోంది. ఈ నేపథ్యంలో నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే మానవతా దృక్పథంతో స్పందించి సదరు పేద రోగికి ఎల్‌ఓసి (లెటర్ ఆఫ్ క్రెడిట్) ద్వారా ఆర్థిక సహాయం మంజూరు చేయాలని రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డికి వినతి పత్రం సమర్పించారు. పార్టీలకతీతంగా ప్రజల ప్రాణాలను కాపాడడమే తన కర్తవ్యం అని ఎమ్మెల్యే పేర్కొంటూ, ప్రభుత్వం సానుకూలంగా స్పందించి రోగికి తక్షణ సహాయం అందించినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

అందుబాటులోకి మన ఇసుక వాహనం ఆన్లైన్ బుకింగ్ యాప్

- **జిల్లాలో ప్రయోగాత్మక అమలుకు శ్రీకారం**
- **మ్యానువల్ విధానానికి ఇకపై చెల్లుచీటీ**
- **కలెక్టర్ ఇలా త్రిపాఠి వెల్లడి**
- **ఇందిరమ్మ ఇండ్లకు ఉచితంగా ఇసుక కేటాయింపు**

ప్రతిపక్షం బ్యూరో,నిజామాబాద్, జనవరి 31 :

ఇసుక అక్రమ రవాణాను అరికట్టడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం సరికొత్తగా ప్రవేశపెట్టిన మన ఇసుక వాహనం ఆన్లైన్ బుకింగ్ యాప్ విధానాన్ని నిజామాబాద్ జిల్లాలో అందుబాటులోకి తెచ్చామని కలెక్టర్ ఇలా త్రిపాఠి తెలిపారు. శనివారం ఆమె సబ్ కలెక్టర్లు, తహసీల్దార్లు, ఎంపీడీఓలు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు, మైనింగ్, గ్రౌండ్ వాటర్ తదితర శాఖల అధికారులతో టెలి కాన్ఫరెన్స్ ద్వారా ఈ నూతన విధానం అమలుకు సంబంధించిన ఏర్పాట్లపై సమీక్ష జరిపారు. మ్యానువల్ విధానానికి స్వస్తి పలుకుతూ, ఇక నుండి పూర్తిగా ఆన్లైన్ విధానంలోనే ఇసుక బుకింగ్ చేసుకునేలా చర్యలు తీసుకున్నామని కలెక్టర్ వెల్లడించారు..

'మన ఇసుక వాహనం' యాప్ ద్వారా ఆన్‌లైన్ లో ఇసుక బుకింగ్ విధానం వల్ల మధ్యవర్తుల ప్రమేయం లేకుండా వినియోగదారులకు మరింత పారదర్శకంగా, నేరుగా ఇసుక అందుతుందని కలెక్టర్ స్పష్టం చేశారు. ఇందిరమ్మ ఇళ్ళ నిర్మాణాల కోసం లబ్దిదారులకు ఉచితంగా ఇసుకను కేటాయించడం జరుగుతుందని తెలిపారు. ఇసుక లోడింగ్, విలేజ్ ఫండ్ కింద ఒక ఇసుక ట్రాక్టర్ లోడ్ కు కేవలం 612 రూపాయలను మాత్రమే ఇందిరమ్మ ఇళ్ళ లబ్దిదారులు చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఇతర గృహ నిర్మాణదారులు, ప్రభుత్వ పనులకు అవసరమైన ఇసుక కోసం 1173 రూపాయలు చెల్లించాలన్నారు. ఆన్లైన్ లోనే యూ.పీ.ఐ పేమెంట్ చేయాలని సూచించారు. అయితే ఇసుక తరలింపు కోసం వినియోగదారులే ట్రాక్టర్ వాహనాన్ని సమకూర్చుకోవాల్సి ఉంటుందని స్పష్టం చేశారు.

స్మార్ట్ ఫోన్లు లేని వారు గ్రామ పంచాయతీ కార్యదర్శులని సంప్రదించి వారి లాగిన్ ద్వారా ఇసుక బుకింగ్ చేసుకోవచ్చని సూచించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ మ్యానువల్ రసీదులు, అనుమతులు ఇవ్వకూడదని అధికారులకు సూచించారు. ఇసుకను ట్రాక్టర్ ద్వారానే తీసుకెళ్లేందుకు అనుమతించాలని, టిప్పర్లు, లారీలు వంటి వాహనాలకు అనుమతి లేదని అన్నారు. అదేవిధంగా ఇసుక రీచ్ లలో కూడా జే.సీ.బీలు, డోజర్లు వంటి యంత్రాలను వినియోగించకూడదని, కూలీల ద్వారానే ట్రాక్టర్ ట్రాలీలో నిర్ణీత పరిమాణం మేరకు ఇసుక లోడింగ్ చేయాలని సూచించారు. మన ఇసుక వాహనం ఆన్లైన్ బుకింగ్ విధానం అమలు కోసం జిల్లాను ఎంపిక చేసినందున అధికారులు నిబద్ధతతో పనిచేసి నూటికి నూరు శాతం విజయవంతం అయ్యేలా చొరవ చూపాలన్నారు. తహశీల్దార్లు పకడ్బందీగా విధులు నిర్వర్తించాలని, ఆర్డీవోలు కట్టుదిట్టమైన పర్యవేక్షణ జరపాలని కలెక్టర్ ఆదేశించారు. టెలి కాన్ఫరెన్స్ లో అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్, బోధన్ ఆర్మూర్ సబ్ కలెక్టర్లు వికాస్ మహతో, అభిగ్యాన్ మాల్వియ, నిజామాబాద్ ఆర్డీఓ రాజేంద్ర కుమార్, మైనింగ్ శాఖ ఏ.డీ జి.సంజయ్ కుమార్, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రజావాణి తాత్కాలికంగా వాయిదా...

మున్సిపల్ ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉన్నందున జిల్లా కలెక్టరేట్ నందు ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని. తాత్కాలికంగా వాయిదా వేస్తున్నట్లు కలెక్టర్ ఇలా త్రిపాఠి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మున్సిపల్ ఎన్నికలు ముగిసిన తర్వాత ప్రజావాణి కార్యక్రమం యధావిధిగా కొనసాగుతుందని తెలిపారు. జిల్లా ప్రజలు, పిర్యాదుదారులు ఈ విషయాన్ని గమనించి జిల్లా యంత్రాంగానికి సహకరించాలని కలెక్టర్ కోరారు.



విద్యార్థులు చరిత్రపై అవగాహన పెంచుకోవాలి

ప్రతిపక్షం,నంగునూరు, జనవరి 31:

జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నంగునూరు నంగునూరు గ్రామానికి చెందిన కొలిపాక శ్రీనివాస్ తెలంగాణ చారిత్రక బృందం సభ్యునిగా తెలంగాణలోని వివిధ ప్రాంతాలలో సంచరించి అనేక చారిత్రక విషయాలను బయటకు తీశారని నంగునూరు ఉన్నత పాఠశాల కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు గొట్టిపర్తి రామస్వామి అన్నారు. నంగునూరు గ్రామానికి చెందిన ఔత్సాహిక చరిత్రకారుడు నంగునూరు చరిత్ర పుస్తక రచయిత కొలిపాక శ్రీనివాస్ నంగునూరు చరిత్ర పుస్తకాన్ని నంగునూరు జడ్.పి.హెచ్.ఎస్.పాఠశాల గ్రంథాలయానికి శనివారం బహుకరించారు. కొత్త తెలంగాణ చారిత్రక బృందం సభ్యుడు అయిన కొలిపాక శ్రీనివాస్ తన స్వగ్రామం నంగునూరుకు సంబంధించిన చారిత్రక విషయాలను పరిశోధించి "నంగునూరు చరిత్ర"రచించారు. ఈ సందర్భంగా పాఠశాల రామస్వామి మాట్లాడుతూ కొలిపాక శ్రీనివాస్ కృషిని అభినందించారు. చరిత్రపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని సూచించారు. చరిత్ర తెలుసుకుంటూనే భవిష్యత్తు నిర్మించుకోవాలని తెలిపారు. తెలంగాణ కొత్త చారిత్రక బృందం సభ్యుడు కొలిపాక శ్రీనివాస్ మాట్లాడుతూ తాను స్వతహాగా ఉన్న ఆసక్తితో అనేక ప్రాంతాలలో ఉన్న చారిత్రక విషయాలను తెలుసుకుంటూ, కొత్త చరిత్ర విషయాలను బయటకి వెలికి తీస్తున్నారని తెలిపారు. చారిత్రక పూర్వ యుగం కాలం నాటి రాతి పరికరాలు, టెర్రకోట బొమ్మలు, వర్తమాన మహావీర విగ్రహం, ఆది మానవుల సమాధులు, యుద్ధ వీరుల విగ్రహాలు లాంటి అనేక చారిత్రక విషయాలను పరిశోధించినట్లు తెలిపారు. ఉపాధ్యాయులు దుబ్బుడు రవీందర్ రెడ్డి, గిరి తిరుపతి, వై.రాంగోపాల్ రెడ్డి, కొత్తపల్లి రవి,నగేశ్, రాజమౌళి, రాజు, సుశీల, నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలి

- **నాణ్యమైన విద్యను అందించాలి**
- **తగిరెడ్డి దేశి రెడ్డి, మండల విద్యాధికారి**

ప్రతిపక్షం, నంగునూరు, జనవరి31:

ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించి వారిని ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలని నంగునూరు మండల విద్యాధికారి తగిరెడ్డి దేశిరెడ్డి ఉపాధ్యాయులకు సూచించారు. నర్మెట్ట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (తపస్) 2026 నూతన సంవత్సర కాలమానిని శనివారం ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ భారతీయ సంస్కృతిలో ఉపాధ్యాయుడి స్థానం చాలా గొప్పదని చెప్పారు. విద్యార్థులను దేశభక్తులుగా భావిభారత పౌరులుగా తీర్చిదిద్దాల్సిన గురుతర బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. ఉపాధ్యాయులు అందరూ తమ విధులను సక్రమంగా నిర్వర్తించి విద్యార్థులను తీర్చిదిద్దాలని కోరారు. తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (తపస్) నంగునూరు మండల శాఖ అధ్యక్షుడు కత్తుల రాంరెడ్డి మాట్లాడుతూ జాతీయవాద ఉపాధ్యాయ సంఘం తపస్ లో పనిచేయడం గర్వకారణంగా భావించాలన్నారు. ఉపాధ్యాయ మిత్రులందరూ తపస్లో చేరి దేశ సంస్కృతిని సాంప్రదాయాలను కాపాడడంలో ముందుండాలని పిలుపునిచ్చారు. తపస్ మండల ప్రధాన కార్యదర్శి బొజ్జ చంద్రకాంత్ మాట్లాడుతూ ప్రభుత్వం ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించడంలో అలసత్వం విడనాడి వెంటనే ప్రభుత్వ ఉద్యోగ ఉపాధ్యాయులు, రిటైర్డ్ ఉద్యోగ ఉపాధ్యాయులకు రావలసిన బకాయిలను, డీఏలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున నిరసన ప్రదర్శనలకు పిలుపునిస్తామని చెప్పారు.ఈ కార్యక్రమంలో గడీల శ్రీకాంత్, వీరేశం, జైపాల్ యాదవ్, వెంకటేశం, భాస్కర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, యాదవ రెడ్డి, చంద్రం, బాలమల్లు, శ్రీహరి, లక్ష్మి నర్సయ్య, పులగూర్ల రాజేశ్వర్ రెడ్డి, శ్రీనివాస్, రామకృష్ణ, సుమ, నాగలక్ష్మి, లావణ్య, ధరణి, ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.





ఆధార్ సేవలు పునః ప్రారంభం

ప్రతిపక్షం,నంగునూరు, జనవరి 31:

నంగునూరు మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో ఆధార్ సేవలు పునః ప్రారంభించినట్లు ఆధార్ నిర్వాహకుడు అనంతారం నగేష్ తెలిపారు. ప్రభుత్వానికి సంబంధించిన దాదాపు ప్రతి పనికి ఆధార్ కార్డు తప్పనిసరి కావడంతో, ప్రజల సౌకర్యార్థం ఈ ఆధార్ సేవలను తిరిగి అందుబాటులోకి తీసుకువచ్చినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ ఆధార్ కేంద్రంలో ఆధార్‌లో మొబైల్ నంబర్ మార్పు,ఫోటో మార్పు, బయోమెట్రిక్ (వేలిముద్రలు, కంటి స్కాన్) సవరణలు,నూతన ఆధార్ కార్డు నమోదు,ఐదు సంవత్సరాలు నిండిన ప్రతి బాలుడి ఆధార్‌కు బయోమెట్రిక్ నవీకరణ, చిరునామా (అడ్రస్) సవరణలు వంటి సేవలు నిర్వహించనున్నట్లు ఆయన వివరించారు. ఈ సేవలను పొందాలనుకునే వారు తప్పనిసరిగా సంబంధిత ఋజువు పత్రాలు (ఆధార్ కాపీ, అడ్రస్ ప్రూఫ్, జనన ధృవీకరణ పత్రం, ఇతర ప్రభుత్వ గుర్తింపు పత్రాలు) తీసుకువచ్చి సేవలు పొందాలని సూచించారు. ప్రజలు దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా, స్థానికంగా అందుబాటులో ఉన్న ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ ఆధార్‌కు సంబంధించిన సవరణలు, నవీకరణలు చేసుకోవాలని ఆధార్ నిర్వాహకుడు అనంతారం నగేష్ విజ్ఞప్తి చేశారు.



కష్టంలో అండగా నిలిచిన దివ్యాంగుల జేఏసీ

- **సురభి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న దివ్యాంగుడికి సహాయం**
- **ఆసుపత్రి ఖర్చులకు రూ.5,700 నగదు అందజేత**
- **మానవత్వానికి నిదర్శనంగా జేఏసీ చొరవ**

ప్రతిపక్షం ,నంగునూరు, జనవరి 31:

సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం నర్మేట గ్రామానికి చెందిన గంధమల్ల జగన్ (దివ్యాంగుడు)మూడు రోజుల కిందట అనుకోకుండా కిందపడి కాలు విరిగి సురభి సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆర్థిక ఇబ్బందులతో తీవ్రంగా ఇబ్బంది పడుతున్న ఆయన పరిస్థితిని తెలుసుకున్న తెలంగాణ దివ్యాంగుల జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ) నాయకులు వెంటనే స్పందించారు. సురభి సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న గంధమల్ల జగన్‌కు హాస్పిటల్ ఖర్చుల నిమిత్తం దివ్యాంగుల జేఏసీ నాయకులు రూ.5,700 నగదు సహాయం అందజేశారు. కష్టకాలంలో తోటి దివ్యాంగుడికి అండగా నిలబడారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు మాట్లాడుతూ... దివ్యాంగులు కష్టాల్లో ఉన్నప్పుడు తోడుగా నిలవడం తమ బాధ్యత అని చెప్పారు. అవసరంలో ఉన్న ప్రతి దివ్యాంగుడికి జేఏసీ అండగా ఉంటుంది అని తెలిపారు. సహాయం అందడంతో గంధమల్ల జగన్ కుటుంబ సభ్యులు జేఏసీ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిద్దిపేట జిల్లా తెలంగాణ జాయింట్ యాక్షన్ కమిటీ నాయకులు పిడిశెట్టి నారాయణ, పిల్లి అంజయ్య, బొంగోని శ్రీశైలం, గూడూరి బాబు, పందుల బాలమణి, చందనగిరి రాజు, పిట్ల జ్యోతి, ఆకారం రాణి, గడ్డం శ్రీనివాస్ రెడ్డి, జింక యాదగిరి, ఎండి యాకుబ్ తదితరులు పాల్గొన్నారు.



నా సినిమాపై రాజకీయ ప్రభావం ఉంటుందని ముందే ఊహించాను. అన్నింటికీ సిద్ధపడే రాజకీయాల్లోకి వచ్చా. నిర్మాతల గురించే బాధగా ఉంది. నా కారణంగా వాళ్లు ఇబ్బంది పడుతున్నారు. జనవరి 9న రిలీజ్ కావాల్సిన సినిమా సెన్సార్ సర్టిఫికెట్ జారీ ఆలస్యం కావడంతో వాయిదా పడింది.

- విజయ్, టీవీకే చీఫ్

ప్రాంతీయం



జాతీయ రహదారి విస్తరణ పనుల్లో వేగం పెంచండి

- పటాన్ చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, జనవరి 31 :
బిహెచ్ఇఎల్ చౌరస్తా నుండి రుద్రారం గణేష్‌గడ్డ మీదుగా సంగారెడ్డి వరకు చేపడుతున్న జాతీయ రహదారి విస్తరణ పనులు మందకొడిగా కొనసాగుతున్నాయని సర్వీస్ రోడ్లు త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకుని వచ్చి ప్రధాన రహదారి పనులను చేపట్టాలని పటాన్ చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అధికారులను ఆదేశించారు. శనివారం సాయంత్రం పటాన్ చెరు పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జాతీయ రహదారి సంస్థ అధికారులు, కాంట్రాక్టు సంస్థ ప్రతినిధులతో ఎమ్మెల్యే జిఎంఆర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రామచంద్రాపురం, పటాన్చెరు, ముత్తంగి ప్రాంతాలలో రహదారి విస్తరణ పనులు చాలా ఆలస్యంగా జరుగుతున్నాయని అసహనం వ్యక్తం చేశారు. సర్వీస్ రోడ్లు అసంపూర్తిగా ఉండటం మూలంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవడంతో పాటు వాహనదారులు ప్రమాదాలకు గురై చనిపోతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ వైపు నుండి సంపూర్ణ సహకారం అందిస్తున్న పనులు ఎందుకు పూర్తి కావడం లేదని ఆయన ప్రశ్నించారు. రాబోయే నెల రోజుల్లోగా సర్వీస్ రోడ్లు పూర్తి చేయాలని లేని పక్షంలో ఉన్నత అధికారులకు ఫిర్యాదు చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. రహదారుల నిర్మాణ సమయంలో ప్రభుత్వ శాఖలతో ఇబ్బందులు ఎదురైతే సమన్వయం చేసుకుంటూ ముందుకు వెళ్లాలని జాతీయ రహదారుల సంస్థ డి ఈ రామకృష్ణను ఆదేశించారు.



డివిజన్ల అభివృద్ధికి సంపూర్ణ సహకారం

- పటాన్ చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

ప్రతిపక్షం, సంగారెడ్డిప్రతినిధి, జనవరి 31 :
అమీన్ పూర్ సర్కిల్ పరిధిలో నూతనంగా ఏర్పడిన అమీన్ పూర్, బీరంగూడ డివిజన్ల అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తున్నామని పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. బీరంగూడ డివిజన్ పరిధిలోని శ్రీ కృష్ణా నగర్ కాలనీలో నూతనంగా నిర్మించిన కాలనీ ముఖద్వారాన్ని ప్రారంభించిన శనివారం ఎమ్మెల్యే జిఎంఆర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ ఇందుకు అనుగుణంగా ప్రణాళికలు రూపొందిస్తూ నిధులు కేటాయిస్తున్నామని తెలిపారు. ప్రజల సంక్షేమం అభివృద్ధి లక్ష్యంగా పనిచేస్తున్నామని తెలిపారు కాలనీ ముఖద్వారం నిర్మించేందుకు సంపూర్ణ సహకారం అందించిన దాసు యాదవ్ ను ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో అమీన్పూర్ మున్సిపల్ మాజీ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి, మాజీ ఎంపీపీ దేవానందం, మాజీ జెడ్పిటిసి సుధాకర్ రెడ్డి, మాజీ వైస్ చైర్మన్ నందారం నరసింహా గౌడ్, మాజీ ప్రజా ప్రతినిధులు సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.





కార్మికుల పిల్లలకు ఎక్స్‌పోజర్ విజిట్ జీహెచ్ఎంసీ

- ఐఐటీ హైదరాబాద్ ఎక్స్‌పోజర్ విజిట్ కు తరలివెళ్లిన పారిశుద్ధ్య కార్మికుల పిల్లలు

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, జనవరి 31 :
జీహెచ్ఎంసీ పారిశుద్ధ్య కార్మికుల పిల్లల జీవితాల్లో ఆశల దీపం వెలిగించే వినూత్న కార్యక్రమానికి తొలిసారి శ్రీకారం చుట్టింది. శనివారం రోజు దేశంలోని ప్రతిష్టాత్మక విద్యా సంస్థలలో ఒకటైన ఐఐటీ హైదరాబాద్ కు పారిశుద్ధ్య కార్మికుల పిల్లల ను ఎక్స్‌పోజర్ విజిట్ జీహెచ్ఎంసీ తీసుకెళ్ళింది.ప్రతి సర్కిల్ నుంచి ముగ్గురు చొప్పున సుమారు 180 మందిని 6 బస్సు ల ద్వారా ఐఐటీ హైదరాబాద్ క్యాంపస్ సందర్శనకు జీహెచ్ఎంసీ అధికారులు తీసుకెళ్ళిన్నారు. శనివారం ఉదయం 10:30 గంటల నుండి సాయంత్రం 4:30 గంటల వరకు ఈ విజిట్ కొనసాగింది. ఈ విజిట్ ద్వారా ఐఐటీ అధ్యాపకులు, విద్యార్థులతో పరస్పర చర్య, అకడమిక్ భవనాలు, గ్రంథాలయాలు, ఇన్నోవేషన్ సెంటర్ల సందర్శన, ప్రేరణాత్మక సమావేశాల ద్వారా ఈ పిల్లలకు ఒక ప్రపంచ స్థాయి విద్యా వాతావరణాన్ని జీహెచ్ఎంసీ పరిచయం చేయనుందని, చాలా మంది పిల్లలు తొలిసారి ప్రపంచ స్థాయి విద్యా సంస్థను సందర్శించనున్నారు.ఈ కార్యక్రమాన్ని ఐఐటీ హైదరాబాద్‌లోని ఈసెల్ సహకారంతో నిర్వహిస్తున్నట్లు జీహెచ్ఎంసీ నిర్వహిస్తుంది. రవాణా, భోజనం, భద్రత, మార్గదర్శక సహాయం వంటి అన్ని ఏర్పాట్లు ప్రత్యేకంగా చేపట్టి,ప్రతి పిల్లవాడికి ఆత్మవిశ్వాసం కలిగించేలా జిహెచ్ఎంసి చర్యలు తీసుకుంటుంది.జీహెచ్ఎంసీ పారిశుద్ధ్య కార్మికుల పిల్లల ను ఐఐటీ హైదరాబాద్ క్యాంపస్ ఎక్స్పోజర్ విజిట్ కు తీసుకెళుతుండడం పట్ల జిహెచ్ఎంసిని పలువురు ప్రశంసిస్తున్నారు.



కేంద్ర ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలి

- వికలాంగుల జాతీయ వేదిక పిలుపు

ప్రతిపక్షం ప్రతినిధి, సంగారెడ్డి, జనవరి 31:
వికలాంగుల హక్కుల జాతీయ వేదిక (NPRD) సంగారెడ్డి జిల్లా కమిటీ సమావేశం శనివారం కేవల్ కిషన్ భవన్‌లో జిల్లా అధ్యక్షులు యం. బస్వరాజు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యం. అడివయ్య మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. ఉపాధి హామీ పథకాన్ని కాపాడుకోవాలని, వికలాంగుల పెన్షన్ పెంపు కోసం ఉద్యమాలు చేయాలని అన్నారు. ఫిబ్రవరి 12న జరిగే దేశవ్యాప్త సమ్మెలో వికలాంగులంతా పాల్గొనాలని కోరారు.జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు యం. బస్వరాజు, కొనింటి నర్సిములు మాట్లాడుతూ వికలాంగుల సమస్యల పరిష్కారంలో అధికారుల నిర్లక్ష్యాన్ని విమర్శించారు. ఉద్యోగాలు, పెన్షన్లు, సహాయక పరికరాలు, ఇండ్లలో రిజర్వేషన్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షులు జయలక్ష్మి, లలిత, సహాయ కార్యదర్శులు సంగమేశ్వర్, కృపవరం, నాయకులు భాగ్య, మంగమ్మ, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

జహీరాబాద్ పార్లమెంట్ పరిధి మున్సిపల్ ఎన్నికల సన్నాహక సమావేశం

- పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశం.
- పాల్గొన్న మంత్రి దామోదర రాజనర్సింహ, డిసిసి అధ్యక్షురాలు నిర్మలా జగ్గారెడ్డి, ఎంపి సురేష్ శెట్కార్



ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, జనవరి 31 :
జహీరాబాద్ పార్లమెంట్ పరిధి లో మున్సిపల్ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలు, అభ్యర్థుల ఎంపిక, బి ఫార్మ్స్ పంపిణీ పై పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ అధ్యక్షతన శనివారం గాంధీ భవన్ లో సన్నాహక సమావేశం జరిగింది. మంత్రులు దామోదర్ రాజనర్సింహ, అజారుద్దీన్, సంగారెడ్డి డిసిసి అధ్యక్షురాలు నిర్మలా జగ్గారెడ్డి, ముఖ్యమంత్రి సలహాదారు షబ్బీర్ అలీ,ఎంపి సురేష్ షెట్కార్, ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మధన్ మోహన్ రావులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేయబోయే కాంగ్రెస్ అభ్యర్థులకు ఆయా జిల్లాల ఇంఛార్జి మంత్రుల చేతుల మీదుగా బిఫారాలు అందజేయాలని నిర్ణయించారు. గెలిచే అభ్యర్థులకే బి ఫార్మ్ అందజేయాలని, ఎలాంటి పైరవీల కు ప్రభావం కావద్దని పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ ఆదేశించారు. జహీరాబాద్ పార్లమెంట్ పరిధి లో అన్ని మున్సిపల్ స్థానాలు కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకోవాల్సిందేనని మహేష్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు.

సూపర్వైజర్లు, బీఎల్‌వోలు క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా పని చేయాలి

- జిల్లా కలెక్టర్ ప్రావీణ్య

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, జనవరి 31 :
ఓటర్ల జాబితా సవరణలో భాగంగా చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియను నిర్ణీత గడువులో వేగవంతంగా, తప్పిదాలకు తావు లేకుండా పూర్తి చేసేందుకు సూపర్వైజర్లు, బీఎల్‌వోలు క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా పనిచేసేలా అన్ని చర్యలు చేపట్టామని జిల్లా కలెక్టర్ ప్రావీణ్య తెలిపారు. శనివారం హైదరాబాద్ నుండి రాష్ట్ర ఎన్నికల అధికారులతో కలిసి రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎన్నికల అధికారులతో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ పురోగతిపై సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి మాట్లాడుతూ, ఓటర్ల జాబితా సవరణకు చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఓటర్ మ్యాపింగ్‌లో ఎలాంటి తప్పిదాలకు అవకాశం లేకుండా ఈఆర్‌వోలు సమగ్ర పర్యవేక్షణ చేపట్టి, ప్రక్రియ సకాలంలో పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ, ఎస్ఐఆర్ ప్రక్రియను ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా నిర్ణీత గడువులో పూర్తి చేస్తామని తెలిపారు. బీఎల్‌వోలు, సూపర్వైజర్లకు స్పష్టమైన లక్ష్యాలు కేటాయించి, క్షేత్రస్థాయిలో ప్రక్రియ వేగంగా సాగేలా పర్యవేక్షణను మరింత పటిష్టం చేశామని చెప్పారు.ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా నుండి అదనపు కలెక్టర్లు మాధురి, పాండు, ఆర్డీఓ రాజేందర్, ఎన్నికల విభాగం అధికారులు తదితరులు పాల్గొన్నారు.



సంగారెడ్డి జిల్లాలో నెల రోజుల పాటు 30, 30(ఎ) పోలీసు యాక్ట్ అమలు

ప్రతిపక్షం ప్రతినిధి,సంగారెడ్డి, జనవరి 31:
శాంతి భద్రతలను దృష్టిలో ఉంచుకొని సంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా ఫిబ్రవరి 1 నుంచి 28 వరకు నెల రోజుల పాటు 30, 30(ఎ) పోలీసు యాక్ట్ అమలులో ఉంటుందని జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ తెలిపారు. ఈ కాలంలో పోలీసుల ముందస్తు అనుమతి లేకుండా ధర్నాలు, రాస్తారోకోలు, నిరసనలు, ర్యాలీలు, సభలు, సమావేశాలు నిర్వహించరాదని స్పష్టం చేశారు. అనుమతి లేకుండా చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే జిల్లా వ్యాప్తంగా 11 మున్సిపాలిటీలకు సంబంధించి ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున, రాజకీయ పార్టీలను లేదా వ్యక్తులను కించపరిచే వ్యాఖ్యలు, సోషల్ మీడియాలో పోస్టులు చేసినా చట్టపరమైన చర్యలు తప్పవని తెలిపారు.





పార్క్ స్థలం కబ్జాపై హైడ్రాకు ఫిర్యాదు

ప్రతిపక్షం, కుత్బుల్లాపూర్, జనవరి 31 :
నిజాంపేట్ బృందావన్ కాలనీలోని 20 గుంటల పార్క్ స్థలాన్ని కొందరు కబ్జా చేయగా, కాలనీ వాసులు ఐక్యంగా పోరాటం చేసి ఈడీ సర్వే నిర్వహింపజేసి, నివేదిక ఆధారంగా హైడ్రాకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు హైడ్రా అధికారులు శనివారం పార్క్ స్థలాన్ని కాపాడి ఫెన్సింగ్ ఏర్పాటు చేశారు. అయితే, ఆ తరువాత పార్క్ అభివృద్ధి చేసి మౌలిక వసతులు కల్పించాలంటూ ప్రస్తుత డిప్యూటీ కమిషనర్‌కు పలుమార్లు ఫిర్యాదులు చేసినప్పటికీ అధికారులు స్పందించలేదని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేశారు. కనీసం పార్కులను అభివృద్ధి చేయడంలోనూ, ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించడంలోనూ అధికారుల నిర్లక్ష్య వైఖరికి నిరసనగా కాలనీ వాసులు స్వచ్ఛందంగా శ్రమదానం నిర్వహించారు. ప్రభుత్వ అధికారులు పార్కులను కాపాడడమే కాకుండా వాటి అభివృద్ధి బాధ్యతను కూడా నిర్వర్తించాలంటూ కాలనీ వాసులు డిమాండ్ చేశారు. అధికారుల నిర్లక్ష్యాన్ని ప్రశ్నిస్తూ, పార్క్ అభివృద్ధికి తమ శ్రమదానంతో నిరసన తెలపడం గమనార్హం. ఈ కార్యక్రమంలో ఆకుల సతీష్, కాలనీ అధ్యక్షులు చంద్రశేఖర్, మురళీధర్, ఐఎన్‌వీ సత్యనారాయణ, ఎస్. కామేశ్వర రావు, కొండల్ రావు, జీవన్, రంజాన్, శ్రీనివాస్ బొమ్మిడి, సతీష్ కట్ట, ఎన్. రవికిరణ్, వేణుగోపాల్ రెడ్డి, వి. తిరుపతి, వి. సాగర్, టీ. చంద్రశేఖర్, ఎన్. సురేంద్ర కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ హామీ పథకం పేరు తొలగింపునకు కాంగ్రెస్ నిరసన

కూకట్ పల్లి, ప్రతిపక్షం, జనవరి 31:
మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నుంచి మహాత్మా గాంధీ పేరును తొలగించడాన్ని నిరసిస్తూ, టీపీసీసీ లేబర్ సెల్ శేర్లింగంపల్లి అధ్యక్షుడు మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో హైదర్‌నగర్‌లో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ లేబర్ సెల్ రాష్ట్ర వైస్ చైర్మన్ సంజీవ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకాన్ని అణిచివేసేందుకు ప్రయత్నిస్తోందని, కేంద్రం 60 శాతం నిధులు ఇవ్వగా రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం ఇవ్వాలని నిర్వీణ్యం చేసేలా కుట్రలు చేస్తోందని ఆరోపించారు. ఉపాధి హామీ పథకం నుంచి గాంధీ పేరును తొలగించడం దుర్మార్గమైన చర్య అని ఆయన విమర్శించారు. ఈ కార్యక్రమంలో ఎండి ఫయాజ్ లేబర్ సెల్ హైదర్ నగర్ అధ్యక్షుడు, సాద టిడిపి మహేష్, సాజిద్ పాషా తదితరులు పాల్గొన్నారు.



తెల్లాపూర్‌లో ఘనంగా గద్దర్ జయంతి వేడుకలు

ప్రతిపక్షం ప్రతినిధి, సంగారెడ్డి, జనవరి 31:
తెల్లాపూర్ గద్దర్ సర్కిల్‌లో నిర్వహించిన గద్దర్ జయంతి వేడుకల్లో గద్దర్ కూతురు, తెలంగాణ సాంస్కృతిక సారథి ఛైర్‌పర్సన్ డా. గుమ్మడి వెన్నెల మాట్లాడుతూ ప్రజల కోసం తన జీవితాన్ని అంకితం చేసిన మహోన్నత వ్యక్తి గద్దర్ అని అన్నారు. గద్దర్ పాటలు పీడిత వర్గాల్లో చైతన్యం నింపాయని తెలంగాణ ఎంబీసీ చైర్మన్ జెరిపాటి జైపాల్ పేర్కొన్నారు. గద్దర్ పోరాట స్ఫూర్తితోనే ఇక్కడ విగ్రహం ఏర్పాటు చేశామని మాజీ కౌన్సిలర్ కొల్లూరి భరత్ తెలిపారు. సమాజ మార్పు కోసం గద్దర్ చేసిన సేవలు చిరస్మరణీయమని డా. జే.బీ. రాజు అన్నారు. ప్రజా ఉద్యమాలకు గద్దర్ గొంతు దిక్సూచి లాంటిదని సీనియర్ జర్నలిస్టు పాశం యాదగిరి వ్యాఖ్యానించారు. అనంతరం గద్దర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు.




ప్రతి ఆటను క్రీడాస్ఫూర్తితో ఆడాలి

- నాళేశ్వర్ లో గ్రామ స్థాయి క్రీడా పోటీలు ప్రారంభం



ప్రతిపక్షం బ్యూరో, నిజామాబాద్, జనవరి 31 :
క్రీడల్లో గెలుపు ఓటములు సహజమని, ప్రతి ఆటను క్రీడాస్ఫూర్తితో ఆడాలని నాళేశ్వర్ గ్రామ సర్పంచ్ ఆర్మూర్ లావణ్య అన్నారు. ఆర్మూర్ మండలంలోని నాళేశ్వర్ గ్రామంలో మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని నిర్వహిస్తున్న గ్రామ స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ను శుక్రవారం సర్పంచ్ ఘనంగా ప్రారంభించారు. నాళేశ్వర్ గ్రామంలో గత ఏడు సంవత్సరాలుగా మహాశివరాత్రి సందర్భంగా గ్రామ స్థాయి క్రికెట్, వాలీబాల్ టోర్నమెంట్లు నిర్వహించడం ఆనవాయితీగా కొనసాగుతోంది. గ్రామంలో ఉన్న అతి ప్రాచీనమైన స్వయంభూ శివాలయాన్ని దర్శించుకునేందుకు వచ్చే యువకులు ఈ క్రీడా పోటీల్లో ఉత్సాహంగా పాల్గొంటున్నారు. ఈ ఏడాది గ్రామ స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభించగా, ఈ పోటీలు వారం రోజుల పాటు కొనసాగనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ యువకులు క్రీడలతో పాటు ఉన్నత విద్యలోనూ రాణించి మంచి ఉద్యోగాలు సంపాదించి గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ప్రతి సంవత్సరం మహాశివరాత్రి సందర్భంగా క్రీడా పోటీలు నిర్వహించడం హర్షణీయమని, యువకులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని, క్రమశిక్షణ చాలా ముఖ్యమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా నాళేశ్వర్ గ్రామ యువకులకు మహాశివరాత్రి శుభాకాంక్షలు తెలిపారు. మాజీ సొసైటీ చైర్మన్ మగ్గరి హన్మండ్లు మాట్లాడుతూ గత ఏడు సంవత్సరాలుగా క్రికెట్, వాలీబాల్ టోర్నమెంట్లు నిర్వహిస్తున్న గ్రామ యువతను ప్రత్యేకంగా అభినందించారు. ఈ పోటీల్లో విజేతలకు మహాశివరాత్రి రోజున బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ ద్యాగ సరిన్, గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు మాట్లాడుతూ యువకులకు ఎల్లవేళలా తమ సహాయ సహకారాలు ఉంటాయని తెలిపారు. గ్రామ స్థాయి నుంచే కాకుండా రాష్ట్ర స్థాయిలోనూ క్రీడల్లో రాణించాలని, ఆటలతో పాటు చదువులోనూ ముందుండాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఆర్మూర్ శ్రీనివాస్, మాజీ సొసైటీ చైర్మన్ మగ్గరి హన్మండ్లు, కాంగ్రెస్ పార్టీ మండల యువజన అధ్యక్షులు చిన్నదొడ్డి ప్రవీణ్, గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు మనేథ సురేష్, సుంకరి రాజు, కుమ్మరి రాజు, కోందాపురం జనార్ధన్, బర్దిపురం రాజేందర్, సంజీవ్, గ్రామ యువకులు కుమ్మరి కృష్ణ, కోనేరు ప్రసాద్, చిన్నదొడ్డి నవీన్, ప్రహ్లాద్, రణవీర్, మహేష్, అనిల్, నరేష్, గంగాధర్, సాయి, రమేష్, భూమేష్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.




విశాఖలో చంద్రబాబు, ఆయన కుటుంబం దాదాపు రూ. 5వేల కోట్ల విలువైన ప్రభుత్వ భూములను లాగేసుకుంది. రుషికొండ సమీపంలోని 54.79 ఎకరాల భూములను ఎంపీ భరత్ కు కట్టబెట్టారు. లోకేశ్ కు ఎలాంటి అధికార పరిధి లేకపోయినా తోడల్లుడికి కేటాయించేలా చేశారు. ఆ తర్వాత చంద్రబాబు ఒత్తిళ్లతో జీవీఎంసీ సభ్యులను భయపెట్టి ఏకపక్షంగా ఆమోదించుకున్నారు.

- ఏపీ మాజీ సీఎం జగన్

గౌతమ్ అదానీకి 90 రోజుల గడువు

ప్రముఖ భారత పారిశ్రామిక వేత్త గౌతమ్ అదానీ, ఆయన తమ్ముని కుమారుడు సాగర్ అదానీ సివిల్ మోసం కేసులో అమెరికా సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ కమిషన్ (ఎస్ఈసీ) నుంచి లీగల్ నోటీసులు స్వీకరించడానికి అంగీకరించారు. దీంతో విధానపరమైన ప్రధాన అడ్డంకి తొలగిపోయి న్యూయార్క్ బ్రూక్లిన్‌లోని ఫెడరల్ కోర్టులో కేసు విచారణ ముందుకు సాగడానికి మార్గం సుగమమైంది.న్యూయార్క్ తూర్పు డిస్ట్రిక్ట్ కోర్టు ఎదుట హాజరైన అదానీల తరఫు న్యాయవాదులు తమ కక్షిదారుల తరఫున ఎస్ఈసీ సమన్లను స్వీకరించడానికి అంగీకారం తెలిపారు. ఎస్ఈసీ ఆదేశాలకు లోబడి ఉంటామని న్యాయవాదులు అంగీకరించినప్పటికీ అధికార పరిధితో సహా అన్ని కారణాలతో కేసును సవాల్ చేసే హక్కు ప్రతివాదులకు ఉంటుందని కోర్టు పేర్కొంది. కోర్టు ఆదేశాల ప్రకారం ఎస్ఈసీ ఫిర్యాదుపై తమ స్పందనను దాఖలు చేసేందుకు గౌతమ్, సాగర్ అదానీకి 90 రోజుల వ్యవధి ఉంటుంది. అవసరమైతే దీనికి జవాబు దాఖలు చేసేందుకు ఎస్ఈసీ 60 రోజుల వ్యవధి ఉంటుంది. ఆ తర్వాత ప్రతివాదులు తమ సమాధానాలను మళ్లీ దాఖలు చేసుకోవచ్చు. భారత్‌లో అదానీ గ్రీన్ ఎనర్జీ సౌర విద్యుత్ ఒప్పందాలకు సంబంధించిన లంచం పథకం విషయంలో గౌతమ్, సాగర్ అదానీ అమెరికా పెట్టుబడిదారులను తప్పుదారి పట్టించారని, అమెరికా సెక్యూరిటీ చట్టాలు, విదేశీ అవినీతి పద్ధతుల చట్టాన్ని ఉల్లంఘించారన్న ఆరోపణలపై ఈ కేసు నమోదైంది.



విశ్వ వీక్షణం





ఆరోగ్యానికి టీ కప్పు మంత్రం

మనలో చాలా మంది టీ ని ఎంతో ఇష్టంగా తాగుతూ ఉంటారు. ఇది మన శరీరానికి ఉత్సాహాన్ని ఇవ్వడంతో పాటు మనకు వివిధ ఆరోగ్య ప్రయోజనాలు కలిగేలా చేస్తుంది. అద్భుతమైన సమ్మేళనాలతో నిండిన టీని క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల శరీర ఆరోగ్యం మెరుగుపడడంతో పాటు దీర్ఘకాలిక అనారోగ్య సమస్యల ప్రమాదం కూడా తగ్గుతుంది. మెదడు శక్తి పెరగడం, గుండె ఆరోగ్యం మెరుగుపడడంతో పాటు టీని తాగే వారు ఎక్కువ కాలం జీవిస్తారని నిపుణులు చెబుతున్నారు. నీటి తరువాత అత్యంత ప్రజాదరణ పొందిన పానీయాలలో టీ ఒకటి. టీ తాగడం వల్ల వచ్చే ప్రశాంతత కారణంగా దీనిని తాగడానికి అందరూ ఇష్టపడతారు. టీ 5,వేల సంవత్సరాల నాటిది. దీనిని చైనాలో కనుగొన్నారు.




రోగ నిరోధక శక్తికి..

వివిధ సంస్కృతులు, సంప్రదాయాల కారణంగా టీని తయారు చేసే పద్ధతిలో మార్పులు వస్తున్నాయి. టీలో తక్కువ క్యాలరీలు ఉంటాయి. ఇందులో శక్తివంతమైన యాంటీ ఆక్సిడెంట్లు కూడా ఉంటాయి. గుండె ఆరోగ్యాన్ని పెంపొందించడంలో, శరీర రోగనిరోధక శక్తిని పెంచడంలో, శరీర శ్రేయస్సును పెంచడంలో మనకు ఎంతో సహాయపడుతుంది. టీ లో యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉన్న కారణంగా దీనిని తీసుకోవడం వల్ల రక్తపోటు అదుపులో ఉంటుంది. కొలెస్ట్రాల్ స్థాయిలు అదుపులో ఉంటాయి. స్ట్రోక్ వచ్చే ప్రమాదం తగ్గుతుంది. టీ ని తాగడం వల్ల మరణ ప్రమాదం 9 నుండి 13 శాతం వరకు తక్కువగా ఉంటుందని నిపుణులు తెలియజేస్తున్నారు. టీ తాగడం వల్ల సహజమైన ఉత్తేజం వస్తుంది. దీనిలో కెఫిన్, ఎల్- థియనిన్ కలిసి ఉంటాయి. దీంతో టీ తాగడం వల్ల ఏకాగ్రత పెరుగుతుంది.



బ్లాక్ టీ అయితేనే..

అలాగే కమోమిల్ టీ, పుదీనా టీ వంటి వాటిని తాగడం వల్ల ఏకాగ్రత పెరుగుతుంది. గ్రీన్ టీని తాగడం వల్ల శరీరంలో జీవక్రియల వేగం పెరిగి బరువు తగ్గుతారు. గ్రీన్ టీ తాగడం వల్ల దీర్ఘకాలిక అనారోగ్య సమస్యల బారిన పడే అవకాశాలు కూడా తక్కువగా ఉంటాయి. టీ తాగడం వల్ల శరీరం హైడ్రెటెడ్ గా ఉంటుంది. దీంతో కీళ్ల పనితీరు మెరుగుపడడంతో పాటు జీర్ణక్రియ కూడా సాఫీగా సాగుతుంది. అంతేకాకుండా టీ ని తాగడం వల్ల శరీరంలో వ్యర్థాలు తొలగిపోతాయి. జీర్ణక్రియ ఆరోగ్యానికి కూడా టీ ఎంతో మేలు చేస్తుంది. టీ తాగడం వల్ల పేగుల్లో మంచి బ్యాక్టీరియా శాతం పెరుగుతుంది. జీర్ణ సమస్యలు తొలగిపోతాయి. టీ తాగేవారు ఎక్కువకాలం పాటు జీవిస్తారని అధ్యయనాలు చెబుతున్నాయి. టీ అనగానే పాలు, చక్కెర, టీ పొడి వేసే తయారు చేసే టీ అనుకుంటారు చాలా మంది కానీ హెర్బల్ టీ, బ్లాక్ టీ, గ్రీన్ టీ వంటి వాటిని తీసుకున్నప్పుడే మనం ఈ ప్రయోజనాలను పొందవచ్చు. సరైన టీని ఎంపిక చేసుకుని రోజూ ఒక కప్పు మోతాదులో తీసుకోవడం వల్ల దీర్ఘకాలం పాటు ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని నిపుణులు తెలియజేస్తున్నారు.



మెదడు పనితీరుకు..

టీ లో ఉండే ఎల్- థియనిన్ అనే ఆమైనో అమ్లం ఏకాగ్రతను పెంచడంలో సహాయపడుతుంది. జ్ఞాపకశక్తిని పెంచుతుంది. టీ మెదడుకు ఒక అద్భుతమైన పానీయంలా పని చేస్తుందని నిపుణులు చెబుతున్నారు. కాఫీలా కాకుండా టీ తాగడం వల్ల కెఫిన్ నెమ్మదిగా గ్రహించబడుతుంది. దీంతో స్థిరమైన శక్తి లభిస్తుంది. టీ లో ఉండే ఎల్- థియనిన్ టీకి ఒక గొప్ప రుచిని ఇస్తుంది. టీ తాగడం వల్ల వచ్చే విశ్రాంతిని, ఆనందకరమైన అనుభూతిని కూడా ఈ అమైనో ఆమ్లం ప్రోత్సహిస్తుంది. టీ తాగడం వల్ల ఒత్తిడి, ఆందోళన వంటి సమస్యలు తగ్గుతాయి. హెర్బల్ టీలను తాగడం వల్ల రక్తంలో చక్కెర స్థాయిలు అదుపులో ఉంటాయి. 2018 లో జరిగిన ఒక అధ్యయనం ప్రకారం బ్లాక్ టీ వాసన చూడడం వల్ల ఒత్తిడి తగ్గుతుందని కనుగొనబడింది.



ఎప్‌స్టీన్ ఫైల్స్‌లో మోదీ పేరుపై
భారత్ సీరియస్

ప్రపంచవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఎప్‌స్టీన్ సెక్స్ కుంభకోణం ఫైల్‌లో భారత ప్రధాని నరేంద్ర మోదీ పేరు ఉండడంపై భారత్ తీవ్రంగా స్పందించింది. అవి ఒక లైంగిక నేరస్థుడిగా శిక్ష అనుభవించిన జెఫ్రీ ఎప్‌స్టీన్ చేసిన చెత్త ప్రేలాపణలు అని కొట్టిపారేసింది. భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ (ఎంఈఓ) ప్రతినిధి రణధీర్ జైస్వాల్ ఒక ప్రకటన విడుదల చేస్తూ, "సోకాల్డ్ ఎప్‌స్టీన్ ఫైల్స్‌లో ప్రధానమంత్రి మోదీ ఇజ్రాయెల్ పర్యటన గురించి ఉన్న ఒక ఈమెయిల్‌పై వస్తున్న రిపోర్టులను మేము చూశాము. 2017 జులైలో ప్రధానమంత్రి జరిపిన అధికారిక ఇజ్రాయెల్ పర్యటన అనే వాస్తవం తప్ప, ఆ ఈమెయిల్‌లో ఉన్న మిగిలిన అంశాలన్నీ శిక్ష పడిన ఒక నేరస్థుడి చెత్త ప్రేలాపనలు మాత్రమే. వాటిని మేము తోసిపుచ్చుతున్నాం" అని పేర్కొన్నారు. 2017 జులైలో ప్రధాని మోదీ జరిపిన ఇజ్రాయెల్ పర్యటన చారిత్రాత్మకమైనది. 1992లో భారత్, ఇజ్రాయెల్ మధ్య పూర్తిస్థాయి దౌత్య సంబంధాలు ఏర్పడిన తర్వాత, ఆ దేశంలో అడుగుపెట్టిన మొదటి భారత ప్రధానమంత్రి మోదీ కావడం గమనార్హం.

భారీగా విడుదలైన రికార్డులు

ఎప్‌స్టీన్ లైంగిక వేధింపుల కేసులో ప్రభుత్వం వద్ద ఉన్న సమాచారాన్ని బహిర్గతం చేయడానికి ఉద్దేశించిన ఒక చట్టం ప్రకారం, అమెరికా జస్టిస్ డిపార్ట్‌మెంట్ తాజాగా ఆ రికార్డులను విడుదల చేసింది. దీనిపై డిప్యూటీ యూఎస్ అటార్నీ జనరల్ టాడ్ బ్లాంచె మాట్లాడుతూ, తాజాగా విడుదల చేసిన వాటిలో దాదాపు 30 లక్షల పేజీల పత్రాలు, 2,000 కంటే ఎక్కువ వీడియోలు, 1,80,000 చిత్రాలు ఉన్నాయని తెలిపారు. డిపార్ట్‌మెంట్ వెబ్‌సైట్‌లో ప్రచురించబడిన ఈ ఫైళ్లలో, గత ఏడాది డిసెంబర్‌లో విడుదల చేయకుండా నిలిపివేసిన సమాచారం కూడా చేర్చడం గమనార్హం. ప్రజలు, రాజకీయ వర్గాల నుంచి వచ్చిన ఒత్తిడితో రూపొందించిన "ఎప్‌స్టీన్ ఫైల్స్ ట్రాన్స్‌పరెన్సీ యాక్ట్" ప్రకారం ఈ వివరాల వెల్లడి తప్పనిసరి అయ్యింది. ఈ చట్టం ఎప్‌స్టీన్ మాత్రమే కాకుండా, అతని సహచరురాలు ఘిస్లేన్ మాక్స్‌వెల్‌కు సంబంధించిన ఫైళ్లను కూడా బహిర్గతం చేయాలని స్పష్టం చేసింది. జెఫ్రీ ఎప్‌స్టీన్ 2019 జులైలో ఫెడరల్ సెక్స్ ట్రాఫికింగ్ ఆరోపణలపై అరెస్ట్ అయ్యి, 2019 ఆగస్టులో న్యూయార్క్ జైలు గదిలో మరణించాడు. అతని మరణాన్ని ఆత్మహత్యగా అధికారులు నిర్ధరించారు.



అమెరికాలో మరోసారి షట్‌డౌన్

అమెరికాలో మళ్లీ ఆర్థిక సంక్షోభం తలెత్తింది. 2026 బడ్జెట్‌ను ఆమోదించడానికి అర్ధరాత్రి గడువును కాంగ్రెస్ కోల్పోవడంతో శనివారం అమెరికా ప్రభుత్వం పాక్షికంగా షట్‌డౌన్‌లోకి వెళ్లింది. ఈ కారణంగా ప్రభుత్వ నిధులలో తాత్కాలిక అవరోధం తలెత్తిందని వార్తా సంస్థ ఏఎఫ్‌పీ తెలిపింది. ఈ షట్‌డౌన్ తాత్కాలికమేనని శాసనకర్తలు సూచించగా వచ్చే వారం మొదట్లో సెనేట్ మద్దతుతో నిధుల విడుదలపై ఓ బిల్లును కాంగ్రెస్ ఆమోదించే అవకాశం ఉంది.గతవారం ఫెడరల్ ఇమిగ్రేషన్ ఏజెంట్ల చేతుల్లో మిన్నీపోలిస్‌లో ఇద్దరు నిరసనకారులు మృతి చెందడంపై డెమోక్రటిక్ సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేసిన నేపథ్యంలో నిధుల బిల్లుపై చర్చలు విఫలం కావడంతో వాటి విడుదలలో అవరోధం ఏర్పడింది. డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోం ల్యాండ్ సెక్యూరిటీ కోసం కొత్త నిధుల కేటాయింపుపై చర్చలకు ఈ ఘటనతో ప్రతిష్టంభన ఏర్పడింది. ఫెడరల్ ఏజెంట్ల ప్రవర్తనపై కొత్త ఆంక్షలను చేర్చడానికి డీహెచ్ఎస్ నిధుల బిల్లును సమీక్షించాలని డెమోక్రాట్లు డిమాండ్ చేస్తున్నారు.



టీఎంసీ సర్కార్‌పై అమిత్ షా నిప్పులు

ఈ ఏడాది మార్చి లేదా ఏప్రిల్‌లో పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో తాజాగా అక్కడి టీఎంసీ ప్రభుత్వంపై కేంద్ర హోం మంత్రి అమిత్ షా తీవ్ర విమర్శలు చేశారు. ఎన్నికల్లో ప్రయోజనం పొందేందుకే టీఎంసీ సర్కార్ చొరబాటుదారులకు ఆశ్రయం కల్పిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. అవినీతిని వ్యవస్థీకృతం చేయడం, అలాగే సరిహద్దు భద్రతా చర్యలను ఉద్దేశపూర్వకంగా అడ్డుకుంటోందని మండిపడ్డారు. ఉత్తర 24 పరగణాల జిల్లాలోని బ్యారక్‌పుర్‌లో ఏర్పాటు చేసిన పార్టీ మీటింగ్‌లో అమిత్ షా మాట్లాడారు. వచ్చే ఎన్నికల్లో తాము అధికారంలోకి వస్తే 45 రోజుల్లోనే రాష్ట్రంలో సరిహద్దు కంచె వేస్తామని అన్నారు. పశ్చిమ బెంగాల్‌లో జరుగుతున్న చొరబాట్లు దేశవ్యాప్తంగా ప్రధాన సమస్యగా మారినట్లు పేర్కొన్నారు. కోర్టు ఆదేశాలు ఇచ్చిన తర్వాత కూడా బార్డర్ ఫెన్సింగ్ కోసం మమతా ప్రభుత్వం BSFకు భూమిని కేటాయించడం లేదంటూ ధ్వజమెత్తారు. చొరబాటుదారులను టీఎంసీ ఓటు బ్యాంకుగా చూస్తోందని మండిపడ్డారు. రాష్ట్ర పోలీసులు, అధికారులు సైతం అక్రమ వలసలను అడ్డుకోవడం లేదన్నారు. ఫేక్ డాక్యుమెంట్లతో చొరబాటుదారులు దేశమంతా వెళ్తున్నారని అన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో దేశ భద్రత కోసం పశ్చిమ బెంగాల్‌లో బీజేపీ గెలుపు ఎంతో ముఖ్యమని అన్నారు.







ఇషాన్ కిషన్ సెంచరీ విధ్వంసం

న్యూజిలాండ్‌తో జరుగుతున్న ఐదో టీ20 మ్యాచులో భారత్ భారీ స్కోరు సాధించింది. ఇషాన్ కిషన్ సూపర్ సెంచరీ, సూర్య కుమార్ యాదవ్ మెరుపు ఇన్నింగ్స్‌తోపాటు భారత బ్యాటర్లు రాణించడంతో ఇండియా భారీ స్కోరు నమోదు చేసింది. 20 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి, 271 పరుగులు చేసింది. న్యూజిలాండ్ ముందు 272 పరుగుల భారీ టార్గెట్ ఉంచింది.టీ20లలో ఇండియాకు ఇది మూడో అత్యధిక స్కోరు. తొలుత టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న టీమిండియాకు బ్యాటర్లు అద్భుతమైన ఆటను అందించారు. ఓపెనర్ అభిషేక్ శర్మ 16 బంతుల్లోనే 30 పరుగులు చేశాడు. అయితే, సంజూ శాంసన్ 6 పరుగులు మాత్రమే చేసి ఔటయ్యాడు. తర్వాత వచ్చిన ఇషాన్ కిషన్ ఆకాశమే హద్దుగా చెలరేగాడు. 43 బంతుల్లోనే 4 ఫోర్లు, 10 సిక్సర్లతో 103 పరుగులు చేశాడు. అతడి స్ట్రైక్ రేటు 239. హార్థిక్ పాండ్యా 17 బంతుల్లో ఒక ఫోర్, 4 సిక్సర్లతో 42 పరుగులు చేశాడు. తర్వాత వచ్చిన రింకూ సింగ్ 8 బంతుల్లో 8 పరుగులు, శివం దూబే 2 బంతుల్లో 7 పరుగులు చేయడంతో ఇండియా 271 పరుగులు చేసింది. ప్రస్తుతం న్యూజిలాండ్ 1.1 ఓవర్లలోనే 23 పరుగులకు ఒక వికెట్ కోల్పోయింది.

న్యూజిలాండ్‌పై భారత్ ఘన విజయం

తిరువనంతపురంలో జరిగిన ఐదో టీ20 మ్యాచ్‌లో భారత్ న్యూజిలాండ్‌పై 46 పరుగుల తేడాతో ఘనవిజయం సాధించింది. దీనితో 5 మ్యాచ్‌ల సిరీస్ 41 తేడాతో భారత్ కైవసం అయ్యింది. మొదట బ్యాటింగ్ చేసిన భారత్ 5 వికెట్లు కోల్పోయి 271 పరుగులు చేయగా, లక్ష్యాన్ని ఛేదించలేక న్యూజిలాండ్ 225 పరుగులకే చతికిలపడింది. భారత్ బ్యాటర్లలో ఇషాన్ కిషన్ (103), సూర్యకుమార్ (63), హార్దిక్ (42) రాణించారు.

ప్రతిపక్షం
Prathipaksham.in
8
హైదరాబాద్
ఆదివారం
01.02.2026

సినిమా



ఆస్ట్రేలియన్ ఓపెన్ విజేత
ఎలినా రిబకినా..

ఎలినా రిబకినా సంచలనం సృష్టించింది. ఆస్ట్రేలియన్ ఓపెన్ మహిళ సింగిల్స్ టైటిల్‌ను కైవసం చేసుకున్నది. ఇవాళ జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో వరల్డ్ నెంబర్ వన్ అరినా సబలెంకను ఓడించి తొలి గ్రాండ్‌స్లామ్ ట్రోఫీని అందుకున్నది. రసవత్తరంగా సాగిన మ్యాచ్‌లో.. రిబకినా మూడవ సెట్‌లో అనూహ్య రీతిలో సత్తా చాటింది. కజకిస్తాన్ అయిదో సీడ్ ప్లేయర్ రిబకినా మూడవ సెట్‌లో ఓ దశలో 30 తేడాతో వెనుకబడి ఉన్నది. కానీ ఆ తర్వాత కోలుకున్న ఆమె తిరుగులేని ఆటను ప్రదర్శించింది. వరుసగా అయిదు గేమ్‌లను గెలిచి 64 46 64 స్కోరుతో మ్యాచ్‌లో విజయాన్ని నమోదు చేసింది. 2023 ఫైనల్లో సబలెంక చేతిలో రిబకినా ఓడింది. ఆ ఓటమికి ఇప్పుడు ఆమె రివేంజ్ తీసుకున్నది. యూఎస్ ఓపెన్ చాంపియన్ అయిన సబలెంక.. గత నాలుగు గ్రాండ్ స్లామ్ ఫైనల్స్‌లో మూడింటిని కోల్పోయింది. గత ఏడాది ఆస్ట్రేలియన్ ఓపెన్, ఫ్రెంచ్ ఓపెన్ ఫైనల్స్‌లోనూ ఆమె ఓటమి పాలైంది.



సూర్యలో రోహిత్ శర్మ కనిపిస్తున్నాడు

టీ20 కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్‌పై భారత మాజీ ఆల్‌రౌండర్ ఇర్ఫాన్ పఠాన్ ప్రశంశల జల్లు కురిపించాడు. అతని ఆట తీరులో రోహిత్ శర్మ ఛాయలున్నాయని కొనియాడారు. ఒక టీం లీడర్‌గా అతను జట్టును నడిపించటంలో సేమ్‌టు సేమ్ రోహిత్‌ను తలపిస్తాడని పఠాన్ అన్నారు. టి20 కెప్టెన్‌గా సూర్యకుమార్ అద్భుతమైన ఫలితాలు సాధిస్తున్నప్పటికీ అతనికి దక్కాల్సిన గుర్తింపు దక్కట్లేదన్నారు. 'రోహిత్ శర్మ తరువాత కెప్టెన్సీ బాధ్యలు తీసుకున్న సూర్య.. భారత జట్టును ఎలాంటి ఇబ్బందులు లేకుండా ముందుకు నడిపించాడు. అతని కెప్టెన్సీలో 41 టీ20లు ఆడిన భారత్ 31మ్యాచ్‌లు గెలిచింది. 2025 ఆసియా కప్‌ను సైతం స్వాధీనం చేసుకుంది. సూర్య కుమార్ జట్టు కెప్టెన్‌గా అద్భుత ఫలితాలు సాధించినప్పటికీ అతను వ్యక్తిగతగా పరుగులు చేయడంలో విమర్శలకు గురయ్యాడు. ముఖ్యంగా 2025లో ఆడిన మ్యాచ్‌లలో అతను చెప్పుకోదగిన పరుగులు చేయలేకపోయాడు. మొత్తం 21 మ్యాచ్‌లు ఆడిన సూర్య కేవలం 218 పరుగులు సాధించాడు. టి20 ప్రపంచ కప్‌కు ముందు సూర్యకుమార్ అతని ఫామ్‌ను నిరూపించుకోవాల్సిన అవసరముంది' అని పఠాన్ అన్నాడు. కెప్టెన్‌గా అతను వరల్డ్‌కప్‌లో ఖచ్చితంగా ఆడతాడని పేర్కొన్నాడు. కానీ అంత కంటే ముందు అతను పరుగులు చేసి తన సత్తా ఏంటో నిరూపించుకోవాల్సిన అవసరముందని పఠాన్ అభిప్రాయపడ్డాడు.

జాతీయ స్థాయి షూటింగ్‌బాల్
పోటీలకు 'శ్రీజ' ఎంపిక..



జాతీయ స్థాయి సీనియర్ మహిళల షూటింగ్‌బాల్ టోర్నీకి మహబూబ్‌నగర్ జిల్లా మహ్మదాబాద్ మండలం మంగంపేటకు చెందిన గొల్ల బండారి శ్రీజ ఎంపికైంది. జనవరి 17, 18 తేదీలలో వికారాబాద్ జిల్లా తాండూర్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి సౌత్ జోన్ సీనియర్ మహిళల షూటింగ్ బాల్ పోటీల్లో పాల్గొని ప్రతిభ చాటి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు యువతి తండ్రి రాజు తెలిపాడు. ఫిబ్రవరి 6 నుంచి 9వ తేదీ వరకు తిరుపతిలో జరిగే పోటీల్లో పాల్గొననున్నట్లు చెప్పారు.



ధనుష్ సరసన
శ్రీలీల

సాధారణంగా సినీరంగంలో విజయాలు లేకపోతే అవకాశాలు వాటంతటవే తగ్గిపోతాయి. కానీ అచ్చతెలుగందం శ్రీలీల విషయంలో ఈ ట్రెండ్ రివర్స్ అవుతున్నది. ఇటీవలకాలంలో ఈ భామ నటించిన సినిమాలు ఆశించిన విజయాల్ని అందుకోలేకపోయాయి. అయినా ఈ అమ్మడికి అవకాశాలు మాత్రం భారీగానే వస్తున్నాయి. చూడముచ్చటైన అందం, చక్కటి స్క్రీన్‌ప్రజెన్స్, యువతలో తిరుగులేని ఫాలోయింగ్ వంటి కారణాలు సినిమా ఫలితాలతో సంబంధం లేకుండా అవకాశాల్ని తెచ్చిపెడుతున్నాయని ఇండస్ట్రీ టాక్. తాజాగా ఈ ముద్దుగుమ్మ తమిళంలో ధనుష్ సరసన బంపరాఫర్‌ను దక్కించుకుంది.ధనుష్ హీరోగా 'అమరన్' ఫేమ్ రాజ్‌కుమార్ పెరియసామి దర్శకత్వంలో ఓ చిత్రం తెరకెక్కుతున్న విషయం తెలిసిందే. ఇందులో శ్రీలీలను కథానాయికగా ఖరారు చేశారు. ఈ విషయాన్ని చిత్రబృందం అధికారికంగా ప్రకటించింది. ఇటీవల విడుదలైన 'పరాశక్తి' చిత్రంతో తమిళంలో ఎంట్రీ ఇచ్చింది శ్రీలీల. అయితే ఈ సినిమా పరాజయం పాలైంది. ఈ నేపథ్యంలో కోలీవుడ్‌లో మరో ప్రతిష్టాత్మక ప్రాజెక్టులో శ్రీలీల ఆఫర్‌ను దక్కించుకోవడం విశేషం.



వారణాసి రిలీజ్ డేట్ ఫిక్స్

సినీ ప్రేమికులు ఎంతోకాలంగా ఎదురు చూస్తున్న సూపర్ స్టార్ మహేశ్ బాబు, దర్శకధీరుడు రాజమౌళి కాంబినేషన్‌లో రూపొందుతున్న మూవీ వారణాసి విడుదల తేదీపై ఎట్టకేలకు క్లారిటీ వచ్చింది. ఆ ప్రతిష్టాత్మక పాన్ ఇండియా ప్రాజెక్ట్‌ను 2027 ఏప్రిల్ 7న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నట్లు దర్శకుడు రాజమౌళి అధికారికంగా ప్రకటించారు. ఈ విషయాన్ని సోషల్ మీడియాలో పోస్టు చేస్తూ రిలీజ్ డేట్‌ను ఖరారు చేశారు. దీంతో అభిమానుల్లో భారీ ఉత్సాహం నెలకొంది. ఇప్పటికే ఈ సినిమాపై భారీ అంచనాలు నెలకొన్నాయి. మహేశ్‌బాబు కెరీర్‌లోనే అత్యంత భారీ బడ్జెట్‌తో తెరకెక్కుతున్న సినిమా కావడం, రాజమౌళి దర్శకత్వం వహించడం వల్ల ఈ ప్రాజెక్ట్‌కు దేశవ్యాప్తంగా ఆసక్తి పెరిగింది. బాహుబలి, ఆర్‌ఆర్‌ఆర్ లాంటి గ్లోబల్ హిట్స్ తర్వాత రాజమౌళి తీస్తున్న సినిమా కావడంతో ప్రేక్షకులు మరింత ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

ఓటిటీలోకి శర్వానంద్ కామెడీ ఎంటర్‌టైనర్..



సంక్రాంతి కానుకగా థియేటర్లలో విడుదలై మంచి విజయం అందుకున్న కామెడీ ఎంటర్‌టైనర్ 'నారీ నారీ నడుమ మురారి' మూవీ ఓటీటీ విడుదలకు మూహూర్తం ఖరారైంది. ఈ మూవీ ఫిబ్రవరి 4 నుంచి అమెజాన్ ప్రైమ్ వీడియోలో స్ట్రీమింగ్ కానుంది. తెలుగుతో పాటు కన్నడ, తమిళం, మలయాళం, హిందీ భాషల్లోనూ ప్రేక్షకులకు అందుబాటులోకి రానున్నట్లు నిర్మాణ సంస్థ అధికారికంగా ప్రకటించింది. జనవరి 14న సంక్రాంతి బరిలోకి చివరిగా వచ్చిన ఈ మూవీ ప్రేక్షకులను నవ్వుల్లో ముంచెత్తింది. ఇద్దరు అమ్మాయిల మధ్య చిక్కుకున్న యువకుడిగా శర్వానంద్ నటన ఆకట్టుకోగా, హీరోయిన్లుగా సాక్షి వైద్య, సంయుక్త తమ పాత్రల్లో మెప్పించారు. నరేశ్, సత్య, సునీల్, వెన్నెల కిశోర్ తమదైన శైలిలో కామెడీతో అలరించారు. దర్శకుడు రామ్ అబ్బరాజు వినోదాత్మక కథలను తెరకెక్కించడంలో తన ప్రత్యేకతను మరోసారి నిరూపించారు. కథ విషయానికి వస్తే... బీటెక్ పూర్తి చేసి ఆర్కిటెక్ట్‌గా పనిచేస్తున్న గౌతమ్ (శర్వానంద్) నిత్య (సాక్షి వైద్య)తో ప్రేమలో పడతారు. ఇరు కుటుంబాలను ఒప్పించి పెళ్లి చేసుకోవాలని భావించిన గౌతమ్‌కు నిత్య తండ్రి రామలింగం (సంపత్ రాజ్) మొదట అడ్డుపడతాడు. ఆ తర్వాత ఒక షరతుతో పెళ్లికి అంగీకరిస్తాడు. అయితే పెళ్లి రిజిస్టర్ ఆఫీస్‌లో జరగాలని షరతు విధిస్తారు. తప్పనిసరి పరిస్థితిల్లో దీనికి అంగీకరించిన గౌతమ్‌కు దరఖాస్తు చేసిన తర్వాత ఓ అనుకోని చిక్కు ఎదురవుతుంది. గౌతమ్ కాలేజీ రోజుల్లో ప్రేమించిన దియా (సంయుక్త)తో ఉన్న అనుబంధం బయటపడుతుంది. ఈ రెండు ప్రేమకథలు ఎలా ముడిపడ్డాయి? వాటి ప్రభావం గౌతమ్ తండ్రి కార్తీక్ (నరేశ్), పిన్ని పల్లవి (సిరి హనుమంతు)ల దాంపత్య జీవితాన్ని విడాకుల దాకా ఎందుకు తీసుకెళ్లింది? అన్నదే మిగతా కథగా సాగుతుంది.



ఫిబ్రవరి 14న థియేటర్లలోకి
'కపుల్ ఫ్రెండ్లీ'

సంతోష్ శోభన్ హీరోగా నటిస్తున్న రొమాంటిక్ లవ్‌స్టోరీ 'కపుల్ ఫ్రెండ్లీ'. మానస వారణాసి కథానాయిక. అశ్విన్ చంద్రశేఖర్ దర్శకుడు. యూవీ క్రియేషన్స్ సమర్పణలో యూవీ కాన్సెప్ట్స్ పతాకంపై ఈ చిత్రం రూపొందుతున్నది. వాలెంటైన్స్ డే సందర్భంగా ఫిబ్రవరి 14న తెలుగు, తమిళ భాషల్లో ఈ చిత్రం విడుదల కానుంది.నిర్మాత ధీరజ్ మొగిలినేని ఏపీ, తెలంగాణలో ఈ చిత్రాన్ని విడుదల చేస్తున్నారు. ఇప్పటికే విడుదలైన ప్రచార చిత్రాలకు మంచి స్పందన వస్తున్నదని, ఫ్రెండ్షిప్, లవ్, రొమాన్స్.. ఈ మూడింటి చుట్టూ తిరిగే ఈ కథ తప్పక అందరికీ నచ్చుతుందని మేకర్స్ నమ్మకం వ్యక్తం చేస్తున్నారు. ఈ చిత్రానికి కెమెరా: దినేష్ పురుషోత్తమన్, సంగీతం: ఆదిత్య రవీంద్రన్.



'పెద్ది' అప్‌డేట్ థియేటర్లలో
యాక్షన్ ప్రకంపనలే..

రామ్‌చరణ్ 'పెద్ది' సినిమా నుంచి వస్తున్న అప్‌డేట్లు ఆ సినిమాపై అంచనాలను అంతకంతకూ పెంచుతున్నాయి. తాజాగా ఈ సినిమా యాక్షన్ కొరియోగ్రాఫర్ మైబం నబకాంత మైతీ తన సోషల్ మీడియా వేదికగా ఈ సినిమా గురించి ఓ క్రేజీ అప్‌డేట్‌ని అందించారు. 'పెద్ది'లో ఒక్కో యాక్షన్ సీక్వెన్స్ అగ్ని తుఫాన్‌ని తలపిస్తాయని, ఇందులో యాక్షన్ విజువల్స్ థియేటర్లలో ప్రకంపనాలు సృష్టిస్తాయని తన ఇన్‌స్టాగ్రామ్ స్టోరీలో పేర్కొన్నారు మైబామ్ నబాకాంత. ప్రస్తుతం ఈ పోస్ట్ విపరీతంగా వైరల్ అవుతున్నది. 'పెద్ది' క్రీడా నేపథ్యంతో కూడిన సినిమా కావడంతో ఇందులో యాక్షన్ ఎపిసోడ్స్ హైలైట్‌గా నిలువనున్నాయని తెలుస్తున్నది. చిత్రీకరణ చివరి దశకు చేరుకున్న ఈ చిత్రాన్ని మార్చి 27న విడుదల చేయాలని మేకర్స్ తొలుత భావించారు.అయితే.. కొన్ని కారణాల దృష్ట్యా ఈ సినిమా విడుదలను మే నెలకి వాయిదా వేసినట్టు వార్తలొస్తున్నాయి. జాన్వీ కపూర్ కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రంలో శివరాజ్‌కుమార్ కీలక పాత్ర పోషిస్తున్నారు.

మళ్ళీ ఒకటి నుంచి మొదలు పెడుతున్నా

'నా గత చిత్రాలు కొన్ని పూర్తి స్థాయిలో మెప్పించలేపోయాయి. అందుకే అందరి ఫీడ్‌బ్యాక్ తీసుకున్నా. ఈ సినిమాతో మళ్లీ ఒకటి నుంచి మొదలు పెడుతున్నా' అన్నారు హీరో విశ్వక్‌సేన్. ఆయన తాజా చిత్రం 'ఫంకీ' ఈ నెల 13న ప్రేక్షకుల ముందుకురానుంది. అనుదీప్ దర్శకత్వంలో సూర్యదేవర నాగవంశీ, సాయిసౌజన్య నిర్మించారు. కయాదు లోహర్ కథానాయికగా నటించింది. భీమ్స్ సిసిరోలియో స్వరకర్త. శనివారం ఈ సినిమా నుంచి 'రట్టాటటావ్..' అనే గీతాన్ని విడుదల చేశారు.దేవ్ పవార్ సాహిత్యం అందించిన ఈ పాటను రామ్ మిరియాల ఆలపించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో విశ్వక్‌సేన్ మాట్లాడారు. ఇదొక మంచి ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ అని, అనుదీప్ చాలా ప్రత్యేకమైన వ్యక్తి అని, ఆయనతో సినిమా చేశాక జీవితాన్ని చూసే కోణం మారిపోయిందన్నారు.కుటుంబమంతా కలిసి చూసే సినిమా ఇదని, ఆద్యంతం నవ్వుల్ని పంచుతుందని దర్శకుడు అనుదీప్ కేవీ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో చిత్ర యూనిట్ సభ్యులందరూ పాల్గొన్నారు.



Printed, Published and Owned by MOHAMMED AZIZ UR RAHAMAN, Printed at KRK PRINTERS, H.No. 2-3-703/7, Thirumalanagar Colony, Amberpet, Hyderabad, Telangana - 500013.
Published at h.no. 8-1-284/OU/521/7/9, OU Colony, Tolichowki, Golconda, Hyderabad, Telangana - 500008. Editor: FAZUL RAHAMAN MOHAMMED. 040-4390 2732, email: editor@prathipaksham.in, RNI No. APTEL/2007/19200